www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్,
12 జూన్ 2023
సంపుటి: 1, సంచిక: 232

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## బండిపై విష ప్రచారం..
# తెరవేనుక గులాబీ కుట్రలు

బండి దూకుడుతో గులాబీలో మొదలైన గుబులు

అసత్య కథనాలతో అడ్డుకునే యత్నం

సోషల్ మీడియాలో కట్టుకథనాలతో రెచ్చిపోతున్నరు

ఇదే పనిమీద యువరాజు కేటీఆర్ అనునాయులు

**హైదరాబాద్ - స్టేట్ బ్యూరో :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా బండి సంజయ్ దూసుకుపోతుంటే.. బీఆర్ఎస్ కడుపుమండుతుంది. దీంతో బండి మార్పు తథ్యమని తన మీడియాలలో కథనాలు పచ్చి అబద్ధాల కథనాలను గుమ్మరిస్తుంది. రాష్ట్ర అధ్యక్షుడిని మార్చుతున్నారని, ఇటూ పార్టీలో అటూ కార్యకర్తలలో గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ దూకుడును ప్రతిపక్ష పార్టీలు అసత్యాలు ప్రచారాలతో దొంగరీతిన అడ్డుకునేందుకు యత్నాలు చేయడంపై తెలంగాణ సమాజం మండిపడుతుంది. పార్టీలోని అంతర్గత కలహాలు ఉన్నాయని, త్వరలో కొత్త రాష్ట్ర అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉందని లేనివి ఉన్నట్లు చిలువలువలు వలు చేసి విష ప్రచారాన్ని బీఆర్ఎస్ నాయకులు మొదలుపెట్టారు. ఈ మొత్తం వ్యవహారం గులాబీ బాస్ డైరెక్షన్ లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. యువరాజు కేటీఆర్ అనునాయులు బీజేపీ నేతలపై తప్పుడు ఆరోపణలతో సోషల్ మీడియాలో రెచ్చిపోవడమో దీనికి బలమైన సాక్ష్యం. మిగతా 2లో

బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌వైపే అసంతృప్త నేతలు

వరుస సమావేశాలతో ఆ పార్టీ నేతలు బిజీబిజీ


ఇప్పటికే పొంగులేటి, జూపల్లి చేరికలపై క్లారిటీతో మరింత స్పీడ్

ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మొదలైన మంతనాలు

కర్నాటక నేతలతో భేటీ

అనంతరం కొత్త జోష్

రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ వైపు మొగ్గుతున్న ఆశావహులు




# ఆపన్న హస్తం

**హైదరాబాద్, విశాల భారతి:** తెలంగాణ కాంగ్రెస్‌లో చేరికలు క్లైమాక్స్ దశకు చేరుకున్నాయి. అటు బీఆర్ఎస్ నుంచి.. ఇటు బీజేపీ నుంచి అసంతృప్త నేతలు అంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో చేరికలు క్లైమాక్స్ దశకు చేరుకున్నాయి. అటు బీఆర్ఎస్ నుంచి.. ఇటు బీజేపీ నుంచి అసంతృప్త నేతలు అంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారు. ఎప్పుడు ఏ నేత సొంత పార్టీకి గుడ్ బై చెప్పేసి వేరే పార్టీలోకి జంప్ అవుతారో తెలియని పరిస్థితి. మరోవైపు నేతల వరుస భేటీలు, చేరికలతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. శనివారం నాడు మహబూబ్‌నగర్‌లో అదేరోజు సాయంత్రం బెంగళూరులో ఇప్పుడు హైదరాబాద్‌లో వరుస సమావేశాలతో కాంగ్రెస్‌లో చేరే నేతలు బిజీబిజీగా ఉన్నారు. పార్టీలో చేరితే పరిస్థితేంటి..? అసలే ప్రాధాన్యత లేకపోవడం వల్ల సొంత పార్టీకి గుడ్ బై చెప్పి బయటికొచ్చాం.. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరితో ఎలా ఉంటుంది..? అని అన్ని విషయాలు ఆచితూచి మరీ అడుగులేస్తున్నారు. ముఖ్యంగా కీలక నేతలు.. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరికపై దాదాపు క్లారిటీ వచ్చింది కానీ.. ముహూర్తం ఫిక్స్ చేసుకోవడంలో తర్జన భర్జన పడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే తెలంగాణ రాజకీయాలు బెంగళూరు చేరుకున్నాయి. అసలు తెలంగాణ రాజకీయాలకు బెంగళూరుతో సంబంధమేంటి..? నిన్న, ఇవాళ రాష్ట్ర రాజకీయాల్లో జరిగిన పరిణామాలేంటి..? ఇవాళ కోమటిరెడ్డి వెంకటరెడ్డితో భేటీ అయిన నేతలెవరు..? వారంతా ఏం డిసైడ్ అయ్యారు..? భేటీ తర్వాత కోమటిరెడ్డి చేసిన కామెంట్స్ ఏంటి..? అన్నది పరిశీలిస్తే.. కన్నడనాట కాషాయ పార్టీని కనివినీ ఎరుగని రీతిలో ఓడిరచి కాంగ్రెస్ అఖండ విజయం సాధించడంతో మిగతా 2లో

### జగదీష్‌రెడ్డి లాంటోళ్లు ఉంటారు, పోతారు : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్గొండలో జూన్-18 లేదా 19న ప్రియాంక గాంధీ సభ ఉంటుంది. ప్రియాంక సభ తర్వాత కాంగ్రెస్ ఎలా ఉంటుందో చూడండి. వైఎస్ షర్మిల పార్టీలోకి వస్తే మాకు మంచిదే.జూపల్లి నేను పాత మిత్రులం. కాంగ్రెస్‌లోకి వస్తే బాగుంటుందని జూపల్లికి నేను చెప్పాను. క్షేత్రస్థాయిలో మా పార్టీ బలం చూసి కేసీఆర్ భయపడుతున్నారు. మా ప్రభుత్వం రాగానే ప్రజాదర్బార్ నిర్వహిస్తాం. జగదీశ్వర్ రెడ్డి హైట్ ఎంత ఉంది? ఆయన ఏం మాట్లాడుతున్నారు..?. నేను శ్రీధర్ బాబు ఎలా ఉన్నాం? జగదీష్ రెడ్డి ఎలా ఉన్నాడు?.. మేం ప్రజల నుండి వచ్చిన నాయకులం. జగదీష్ రెడ్డి లాంటి వాళ్ళు ఈరోజు ఉంటారు.. రేపు పోతారు' అని కోమటిరెడ్డి మీడియాకు వెల్లడిరచారు. మరోవైపు శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. వైఎస్ షర్మిల - డీకే శివ కుమార్‌లు వ్యక్తిగత పరిచయంతో కలిశారని.. చేరికల విషయంలో అధిష్ఠానందే తుది నిర్ణయమన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే కాంగ్రెస్ పార్టీ లేదని కేసీఆర్ ప్రచారం చేస్తున్నారని శ్రీధర్ మండిపడ్డారు.

## మణిపుర్‌లో మరో 5 రోజులు
# ఇంటర్నెట్ బంద్

**మణిపూర్, విశాల భారతి:** మణిపుర్‌లో ఇంకా హింస చెలరేగుతూనే ఉంది. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటించినా అక్కడి పరిస్థితులు చక్కదిద్దుకోలేదు. అయితే ఈ అల్లర్లను అరికట్టే చర్యల్లో భాగంగా ఆ రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలను మరో ఐదురోజుల పాటు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 15 వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని తెలిపింది. 'ఇంటర్నెట్‌పై నిషేధాన్ని మరో ఐదు రోజులు కొనసాగిస్తున్నాం. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచార వ్యాప్తి, వదంతులను ప్రచారం చేయకుండా ఈ నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు' ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. జూన్ 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు మణిపుర్‌లో ఇంటర్నెట్ పని చేయదని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్రంలో శాంతి, సామరస్యాన్ని స్థాపించడానికి అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని ఆ రాష్ట్ర సమాచార ప్రసార శాఖ మంత్రి సపమ్ రంజన్ తెలిపారు.




## మా స్కీములకు
# జగన్ ఫొటోలు

రాష్ట్రంలో అవినీతి, కుంభకోణాలు

యూపీఏ హయాంలో 12 లక్షల కోట్ల స్కామ్స్

మాది నీతివంతమైన పాలన

కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు

**విశాలభారతి,- ఆంధ్రప్రదేశ్ :** ఏపీలో సీఎం జగన్ పాలనతో అవినీతి, కుంభకోణాలు తప్ప ఇంకేం లేవని.. ప్రధాని మోదీ ఇస్తున్న ఉచిత బియ్యంపైన సైతం జగన్ ఫొటో వేసుకుంటున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. విశాఖలోని రైల్వే గ్రౌండ్ లో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇక్కడికి వచ్చి పలు విషయాలు ప్రస్తావించారు. 10 ఏళ్లు పూర్తి చేసుకున్న యూపీఏ హయాంలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. కానీ మోదీ 9 ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదన్నారు.
రాష్ట్రంలో సీఎం జగన్ పాలనలో అవినీతి, కుంభకోణాలు తప్పా ఏమీ చేయలేదంటూ అమిత్ షా మండిపడ్డారు. పరిపాలన అంటే మోదీని చూసి నేర్చుకోవాలన్నారు. దాయాది పాక్ తోక జాడించి మన సైన్యంపై, సిబ్బందిపై దాడులు మిగతా 2లో



## అప్సర హత్య కేసులో
# ట్విస్ట్

పెళ్లి ఫొటోలు వైరల్

02

## మంత్రి రోజాకు
# అస్వస్థత

చెన్నై అపోలోకు తరలింపు

02



## తాతలతండ్రుల పేర్లు చెప్పి
# రాజకీయాలు చెల్లవు

దశ దిశ లేని పరిపాలన దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు

విద్వేషాలు రెచ్చగొట్టేవారిని నిలువరించడంలో ఎలక్షన్ కమిషన్ వైఫల్యం

మధ్యప్రదేశ్‌లోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలను చైతన్యం చేయాలి

త్వరలోనే ఆ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకుందాం

పలువురి చేరికల సందర్భంగా సీఎం కేసీఆర్ వెల్లడి

**హైదరాబాద్, విశాలభారతి :** డెబ్బై ఐదేండ్ల స్వతంత్ర భారత దేశంలో కేంద్రంలోని పాలన ఇంకా లక్ష్యాన్ని విస్మరించి నిర్లక్ష్యంగానే కొనసాగుతున్నదని, దశ దిశ లేని పరిపాలన దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా పరిణమించిందని, ఈ దిశగా చైతన్యమై, పార్టీలను కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకోవాల్సిన అవసరమున్నదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంకా కూడా.. పార్టీ ఫౌండర్లు సిద్ధాంతకర్తలు తాతల తండ్రుల పేర్లు చెప్పుకోని రాజకీయాలు చేసే పరిస్థితులు చెల్లవని, ఇప్పుడు దేశ ప్రజలకు ' పేర్లతో పనిలేదు.. పని చేయగలిగిన వాల్లతోనే పని (నామ్ దారీ నహీ కామ్ దారీ హోనా చాహియే) అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోకి మహారాష్ట్రతో పాటు మధ్యప్రదేశ్ నుంచి కూడా చేరికలు ఊపందుకున్నాయి. బిఆర్ఎస్ పార్టీ విధానాలు, పార్టీ జాతీయ అధ్యక్షులు సిఎం కేసీఆర్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నచ్చిన మధ్యప్రదేశ్ సీనియర్ రాజకీయ నేతలు, మేధావి, సామాజిక తదితర వర్గాలు పార్టీలో చేరుతున్నారు. మధ్యప్రదేశ్ బిఆర్ఎస్ సమన్వయకర్తగా మాజీ ఎంపీ బుద్ధసేన్ పటేల్ ను అధినేత నియమించడంతో అక్కడ పార్టీ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో పటేల్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు సహా మరో రెండు వందల మంది కీలక రాజకీయ నేతలు ఆదివారం నాడు అధినేత సిఎం కేసీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మధ్యప్రదేశ్ బిఆర్ఎస్ సమన్వయకర్త మాజీ ఎంపీ బుద్ధసేన్ పటేల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో చాంద్వాడా జిల్లా, జున్నార్ దేవ్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే రామ్ దాస్ యికే సర్వజన్ కళ్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, గోండ్వానా పార్టీ అధ్యక్షుడు శోభారామ్ బాలావి, భువన్ సింగ్ కోరం, లక్ష్మణ్ మస్కోలే తో పాటు దాదాపు 200 మంది సీనియర్ రాజకీయనాయకులు ప్రజా సంఘాల నేతలు మేధావులు తదితరులు మిగతా 2లో

## బండిపై విష ప్రచారం..
# తెరవేనుక గులాబీ కుట్రలు

మొదటి పేజీ తరువాయి

బీజేపీ రాష్ట్ర శాఖ చీఫ్ బండి సంజయ్ స్థానంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ లేదా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వచ్చే అవకాశాలున్నాయని గత కొన్ని రోజులుగా గులాబీ మీడియాలో అనేక కథనాలను వండి వారుస్తున్నారు. అయితే, పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ నివేదికలను తోసిపుచ్చింది.బండి సంజయ్‌ను భర్తీ చేసే ఉద్దేశం పార్టీ హైకమాండ్‌కు లేదని, ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనే పార్టీని నడిపిస్తారని బీజేపీ అధిష్టానం కుండబద్దలుకొట్టింది. నిజానికి బీజేపీపార్టీలో పదవుల మార్పుపై ఎలాంటి చర్చ జరగడం లేదు. ఇది కేవలం బీజేపీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ప్రతిపక్ష పార్టీ నేతలు చేస్తున్న ప్రచారం మాత్రమేనని బండి సంజయ్ పలుమార్లు ఎండగట్టారు. గడీల రాజ్యాన్ని బీజేపీ బద్దలుకొట్టడం ఖాయమని, దీన్ని చూసి భయంతోనే గులాబీ పార్టీ తెరవేనుక గోబెల్స్ ప్రచారం మొదలుపెట్టిందని బాహాటంగానే నిప్పులు చెరిగారు. గులాబీ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. ఈసారి ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదని, రాబోయే ఎన్నికల్లో కారును గల్లంతు చేయడం ఖాయమన్నారు. ఇదిలా ఉండగా.. బండి సంజయ్ స్థానంలో ఈటల లేదా అరుణకు అవకాశం కల్పించే ఆలోచన పార్టీ హైకమాండ్‌కు లేదని ప్రత్యర్థి పార్టీల నుంచి చేరిన నేతలు స్పష్టంగా చెబుతున్నారు. బీజేపీ రాష్ట్ర విభాగానికి చెందిన పలువురు సీనియర్ నేతలు కూడా గులాబీ విష ప్రచారంపై నిప్పులు చెరిగారు. గులాబీ కుయుక్తులు రాష్ట్రంలో ఇంకా ఎంతో కాలం నడవవని, త్వరలోనే గులాబీ నేతలు మూటముల్లె సర్దుకోవాల్సిందేనని స్పషం చేస్తున్నారు. కాగా, గులాబీ బాస్ అక్రమంగా పార్టీనుంచి వెళ్లగొట్టిన ఈటల రాజేందర్ బీజేపీ అక్కున చేర్చుకుంది. అరుణ కాంగ్రెస్ నుండి వచ్చి బీజేపీలో చేరారు. ఆ ఇద్దరు నాయకులకు వారి వారి నియోజకవర్గాలలో మాత్రమే ప్రజాదరణ ఉందని, ఎన్నికలకు ఎక్కువ సమయం లేనందున రాష్ట్ర రాజకీయాల్లో వారు క్రియాశీలక ప్రభావం చూపలేరని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు జూన్ 15న ఖమ్మంలో షా నిర్వహించనున్న బహిరంగ సభతో తెలంగాణ వ్యాప్తంగా ప్రచారంలో దూకుడు పెంచాలని స్టేట్ బీజేపీ బాస్ ప్రణాళికులు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అధిష్టానం స్పష్టమైన ఆదేశాలతో బీజేపీ లీడర్లు ఒక్కతాటిపైకి రావడం ఖాయం. అదే జరిగితే గులాబీ పార్టీకి ఇక గడ్డుకాలమే.



## తాతలతండ్రుల పేర్లు చెప్పి
# రాజకీయాలు చెల్లవు

మొదటి పేజీ తరువాయి

బిఆర్ఎస్ లో చేరారు.

**సిఎం కేసీఆర్ మాట్లాడుతూ...**

ఈ దేశంలో ప్రకృతి ప్రసాదించిన నీరు, వ్యవసాయ యోగ్యమైన భూమి, విద్యుత్ కు అవసరమైన బొగ్గు నిల్వలు, వ్యవసాయానికి అవసరమైన సమతల శీతోష్టస్థితి సూర్యరశ్మి తదితర ప్రకృతి వనరులన్నీ అందుబాటులో వున్నాయని వివరించారు. అన్నీ వున్నా కూడా ఇంకా దేశ రైతాంగం ఆత్మహత్యలు చేసుకోవడం శోచనీయమన్నారు. కేంద్రంలోని పాలకులకు లక్ష్యశుద్ధి లోపించడమే ఇందుకు కారణమన్నారు. దళితులు బహుజనులు సహా అన్నివర్గాలు 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఇంకా అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి పోవాలంటే కేంద్రంలో పార్టీలను మార్చడం కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకునే దిశగా చైతన్యం కావాలని సిఎం పిలుపునిచ్చారు. " ఒక పార్టీని వోడిరచి ఇంకో పార్టీని గెలిపిస్తే ఆ పార్టీల పేర్లే మారుతాయి. ఆ నాయకుల పేర్లు మారుతాయి ...కానీ ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఈ నేపథ్యంలో పనివిధానం లో మార్పు తీసుకువచ్చే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలదే (నామ్ బదల్నేసే కుచ్ నహీ హోతా...కామ్ బదల్నా చాహియే) అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే గెలిచిన రెండేండ్లల్లో భారతదేశ ప్రజలకు రైతాంగానికి అవసరమైన విద్యుత్తును 24 గంటలు అందచేస్తామని సిఎం పునరుద్ఘాటించారు. బిఆర్ఎస్ పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, భారత దేశాన్ని మార్చడానికి ఏర్పాటు చేసిన మిషన్ అని స్పష్టం చేశారు. మన వోటును పని చేయనివాళ్లకు కాకుండా మన కోసం పనిచేసుకునే వాళ్లకు వేసుకుంటేనే మన ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. ప్రస్తుతం తెలంగాణ లో దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్నాయని తెలిపిన ముఖ్యమంత్రి తెలంగాణలో అమలు చేస్తున్న దళితబంధు రైతుబంధు రైతుబీమా ఉచిత విద్యుత్ ఆసరా ఫించన్లు వంటి పథకాల గురించి వివరించారు. తెలంగాణలో అమలవుతున్నప్పుడు మధ్యప్రదేశ్ లో ఎందుకు అమలు కావని ప్రశ్నించారు. ఇదే ప్రశ్నను కేంద్రాన్ని అడగాలన్నారు. మన కష్టాలను ఇతరులు తీర్చరని మనమే తీర్చుకోవాల్సి వుంటుందన్నారు. ఈ దేశంలో ఏడు దశాబ్దాలు దాటినా ఆదీవాసీలు దళితులు బహుజనులు పీడితులుగానే కొనసాగాల్సిన దుస్థితి ఇంకెన్నాళ్లు..అని ప్రశ్నించారు. ఇప్పటికే ఉత్తరభారతంలో కనీస జీవన విలువలు లేకుండా వివక్షకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశం మార్పు కోరుకుంటున్నదని, ఈ దిశగా బుద్ధిజీవులు ఆలోచన చేయాలన్నారు. మేధావి వర్గం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా కలిసిరావాలన్నారు. 'దిల్ వాలే దిమాఖ్ వాలే' ఐక్యం కావాల్సిన అవసరమున్నదన్నారు. తప్పుడు వాగ్దానాలతో విద్వేషాలు రెచ్చగొడుతూ ఏమైనా చేసి ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా కొనసాగుతున్న దుర్మార్గాలను నిలవరించడంలో ఎలక్షన్ కమిషన్ వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. త్వరలోనే మధ్యప్రదేశ్ భోపాల్ లో బిఆర్ఎస్ పార్టీకి స్వంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని అన్ని నియోజకవర్గాల్లో వాహనాలను ఏర్పాటు చేసుకుని పార్టీ భావజాలాన్ని ప్రచార సామాగ్రిని గ్రామ గ్రామన తిప్పాలని ప్రజలను చైతన్యం చేయాలని అధినేత స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలోరైతు దళిత మహిళ యువ బీసీ వంటి 9 కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా.. బిఆర్ఎస్ నేతలు శంకరన్న దొంగ్డే, మాణిక్ కదమ్, హిమాన్షు తివారి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మెట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం


మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాజకీయాల్లో పెనుమార్పులు మొదలయ్యాయి. అప్పటి వరకూ బీజేపీ వైపే అడుగులు వేయాలనుకున్న నేతలంతా ఒక్కసారిగా కాంగ్రెస్ వైపు టర్న్ అవుతున్నారు. అంతేకాదు.. బీఆర్ఎస్ సిట్టింగ్‌లు కూడా అసంతృప్తితో రగిలిపోతూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఈ వరుస పరిణామాలతో రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త జోష్ వచ్చినట్లయ్యింది. శనివారం నాడు మహబూబ్‌నగర్ కీలక నేత మల్లు రవితో జూపల్లి, కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో మరో నేత భేటీ అయ్యి కీలక మంతనాలు జరిపారు. పార్టీలో చేరితే ఇచ్చే ప్రాధాన్యత విషయాలపై ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలు.. మల్లుతో చర్చించారు. అనంతరం అక్కడ్నుంచి నేరుగా బెంగళూరుకు పిలుపు రావడంతో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో కలిసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు వెళ్లారు. వీరితో పాటు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఆయన కుమారుడు రాజేష్ కూడా ఉన్నారు. అయితే.. బెంగళూరు వేదికగా తెలంగాణ నేతలు కీలక భేటీలు జరుగుతుండటం, దీనంతటికి కర్ణాటక కాంగ్రెస్ ట్రబుల్ షూటర్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో సమావేశం కావడం కీలక పరిణామమే. మొత్తం డీకే సమక్షంలోనే చర్చలు జరిగాయి. అనంతరం ఈ పరిణామాలన్నింటినీ కాంగ్రెస్ హైకమాండ్‌తో చెప్పి డీకే, రేవంత్ సంప్రదింపులు జరిపారు. ఇప్పటికే జూపల్లి, పొంగులేటి, దామోదర్‌ల చేరిక కాంగ్రెస్‌లో అని తేలిపోయింది. మరో రెండ్రోజుల్లో ఈ ముగ్గురూ మీడియా ముందుకు వచ్చి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంపై అధికారిక ప్రకటన చేయబోతున్నారు. బెంగళూరు సమావేశం ముగిశాక ఆదివారం నాడు హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పొంగులేటి, జూపల్లి భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరే ముందు పార్టీ ముఖ్యనేతలను ఒక్కొక్కరిగా జూపల్లి కలుస్తున్నారు. కోమటిరెడ్డి నివాసానికి శ్రీధర్ బాబుతో కలిసి వచ్చిన పొంగులేటి.. ఎంపీతో భేటీ అయ్యారు. అయితే మీడియా ఉండటంతో పొంగులేటి ముఖం చాటేసి వెళ్లిపోయారు. అయితే సమావేశం అనంతరం జూపల్లి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. 'టీ తాగడానికి మాత్రమే కోమటిరెడ్డి దగ్గరికి వచ్చాను. ఏ పార్టీలో చేరుతానో ఇంకా డిసైడ్ అవ్వలేదు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటాను' అని జూపల్లి చెప్పుకొచ్చారు. ఇన్ని భేటీలు, కీలక మంతనాలు జరిగిన తర్వాత కూడా ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని జూపల్లి చెబుతుండటం గమనార్హం.

## మా స్కీములకు
# జగన్ ఫొటోలు

మొదటి పేజీ తరువాయి

చేస్తుందని కేంద్ర ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్స్ తో సమాధానం చెప్పిందని గుర్తుచేశారు. దేశాన్ని కాపాడే బాధ్యతను ప్రధాని మోదీ తీసుకున్నారు. అంతర్గత భద్రత పటిష్టం చేయడంతో తో పాటు పొరుగు దేశాల నుంచి దాడుల భయం లేకుండా చేసిన ఘనత మోదీ సొంతమన్నారు. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా మోదీ మోదీ అంటూ అక్కడ నినాదాలు చేస్తున్నారు. రైతుల సంక్షేమ ప్రభుత్వం నడిపిస్తున్నామని ఏపీ సీఎం వైఎస్ జగన్ చెబుతున్నారు. కానీ దేశంలో రైతుల ఆత్మహత్యల్లో ఏపీ మూడో స్థానంలో ఉందన్నారు అమిత్ షా. ఇది చూసైనా ఏపీ సీఎం జగన్ సిగ్గు పడాలన్నారు. 9 ఏళ్లలో 70 కోట్ల పేదల కోసం పక్కా ఇళ్లు సహా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. 9 కోట్ల పేదలకు 13 కోట్ల ఉచిత సిలిండర్లు అందించామన్నారు. ప్రతి ఏడాది రైతుల ఖాతాల్లో రూ.6000 జమ చేస్తున్నారు. మోదీ ఇస్తున్న ఈ డబ్బును తాను ఇస్తున్నానని చెప్పి సీఎం జగన్ రైతులను మభ్యపెడుతున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రతి పేదవాడి ఇంటికి కరెంట్ ఇస్తున్నాం, ఉచిత బియ్యం మేం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సీఎం జగన్ బొమ్మ ఎలా వేస్తుందని అమిత్ షా ప్రశ్నించారు. రైతులకు కనీస మద్దతు ధరను రూ.1400 నుంచి రూ.2 వేల రూపాయలకు పెంచింది బీజేపీ అన్నారు. కరోనా సమయంలో ప్రధాని మోదీ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా 2 డోసుల వ్యాక్సిన్ ఇచ్చారని చెప్పారు. విశాఖలో అధికార పార్టీ నేతలు భూదందా చేస్తున్నారు, మైనింగ్ మాఫియాకు పాల్పడుతున్నారు. 10 ఏళ్లలో యూపీఏ ప్రభుత్వం రూ.78 వేల కోట్లు గ్రాంట్ గా ఇచ్చింది. కానీ మోదీ ప్రభుత్వం రూ.2 లక్షల 30 వేల కోట్లు అందించిందని చెప్పారు. తమ ప్రభుత్వం మూడు రెట్లు డబ్బు ఇస్తే, ఆ మనీ ఎక్కడికి పోయింది. జాతీయ రహదారుల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేసింది. సాగర మాల లో భాగంగా ఏపీకి అదనంగా రూ.85 వేల కోట్లను కేంద్రం ఇచ్చిందని అమిత్ షా ప్రస్తావించారు.



# అప్సర హత్య కేసులో ట్విస్ట్

విశాలభారతి, - హైదరాబాద్ : హైదరాబాద్ సరూర్‌నగర్‌లో సంచలనం రేపిన అప్సర అనే యువతిని పూజారి హత్య చేసిన కేసులో సంచలన విషయం ఒకటి బయటికి వచ్చింది. అప్సరకి గతంలోనే వివాహం జరిగిన విషయం తెరపైకి వచ్చింది. ఆ పెళ్లికి సంబంధించిన ఫోటోలు కూడా వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే ఈ హత్య కేసులో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తుండగా.. మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది. భర్తతో విభేదాల కారణంగా అప్సర పుట్టింట్లోనే ఉంటోందని తెలుస్తోంది. జాతకం కోసం సాయిక్రిష్ణ వద్దకు వెళ్లగా, వీరిమధ్య పరిచయం ఏర్పడిందని గుర్తించారు. జాతకంలో ఉన్న దోషాలు పోవడానికి సాయిక్రిష్ణ వివిధ రకాల పూజలు ప్రతిపాదించారని, ఆ పూజలు ఆయనే జరిపించినట్లు సమాచారం. అలా పూజలతో అప్సరకు సాయికష్ణ మరింత దగ్గరైనట్లు తెలిసింది. సరూర్‌నగర్‌లో ఉంటున్న సాయికృష్ణ... అదే ప్రాంతంలో అద్దెకు ఉంటున్న అప్సర అనే అమ్మాయితో వివేహాతర సంబంధం పెట్టుకున్నాడు. బంగారు మైసమ్మ ఆలయంలో పూజారిగా ఉంటూ రియల్ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సాయికృష్ణతో అప్సరకు గుడిలో పరిచయం ఏర్పడింది. తరచూ అప్సర ఇంటికి వెళ్లి వాళ్ల అమ్మను అక్క అంటూ పిలుస్తూ చనువుగా ఉండేవాడు.

# దేశ్ మే తెలంగాణ రోషన్ హై

**జిహెచ్‌ఎంసి అధ్వర్యంలో ఘనంగా సాహితీ దినోత్సవ వేడుకలు**




**హైదరాబాద్, విశాల భారతి:** నవ వసంతాలు పూర్తిచేసుకుని పదో దశాబ్దంలో అడుగులు పడుతున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచాయంటూ యస్సి మహదేవ్ రత్నాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల పురస్కరించుకొని జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితి దినోత్సవం వేడుకల సందర్భంగా జిహెచ్‌ఎంసి ఖైరతాబాద్ జోనల్ యస్సి సహదేవ్, రత్నాకర్, సిపిఅర్‌ఓ మొహమ్మద్ ముర్తుజా, పిఅర్‌ఓ జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ ఎఫ్‌ఎం సలీంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యస్సి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అయినందున 9 ఏళ్లలో అభివృద్ధి సంక్షేమం అమలులో దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ సాహితీ దినోత్సవం సందర్భంగా తెలుగు ఉర్దూ హిందీ సాహితీవేత్తలతో కలిసి కవి సమ్మేళనంలో గంగా జమున తేహజీబ్ ప్రతిబందించేలా జరిగింది. ఆయా భాషలో ప్రావీణ్యం గల సాహితీ వేత్తలు ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేష్ మే తెలంగాణ రోషన్ హై, హమారా సబ్ సే ప్యారా తెలంగాణ, చాహతహం కుష్బూ సే మహక హై తెలంగాణ అభివృద్ధి సంక్షేమలో ఈ తొమ్మిది ఏళ్లలో విరాజిల్లుతున్న తెలంగాణ కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో కవులకు కళాకారులకు ఎనలేని గౌరవం దక్కుతుందంటూ పలువురు పేర్కొన్నారు. అబ్దుల్ రషీద్ హర్షద్, సయ్యద్ నవీద్,జాఫ్రీ, అత్యబ్ ఇజాజ్, జాయిం జుమ్రహ్, షకీల్ హైదర్ నహీం ఘోరీ, జహూర్ జహిర బాది ఏం లక్ష్మణ చార్యులు, మహదేవ్ రత్నాకర్, ఎఫ్ ఏం సలీం, ఉమాదేవి, సవిత సోని, గోవింద్ అక్షయ్, కవులు కవి సమ్మేళనం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఅర్‌ఓ సిబ్బంది మొహమ్మద్ మోసిన్, రోహిత్, రమేష్, కల్యాణి, నర్సింహులు, తౌపిక్, నరేందర్ సయ్యద్ అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు



# బోనం ఎత్తిన మంత్రి కొప్పుల దంపతులు

**జగిత్యాల - విశాలభారతి :** రాష్ట్ర ఎస్సి అభివృద్ధి సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ బోనం ఎత్తారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో ఆదివారం నాడు నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ తల్లి బోనాల ఉత్సవంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులు తలపై బోనం పెట్టుకొని పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి బోనం సమర్పించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్ నేత, జెడ్పీ ఛైర్పర్సన్ దావ వసంత సురేష్, జెడ్పీటీసీ రాజేందర్, ఎంపీపీ రాజమణి వైస్ ఎంపీపీ సుచెందర్, మండల కో ఆప్షన్ రెహ్మాన్ సర్పంచ్ సుమలత శ్రీనివాస్తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## మంత్రి రోజాకు
# అస్వస్థత

**చెన్నై అపోలోకు తరలింపు**

విశాలభారతి, - ఆంధ్రప్రదేశ్ : ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల ఆమెకు కాలు బెణకడంతో వారం రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో.. చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స కోసం చేరినట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. నిత్యం రాజకీయంగా యాక్టివ్‌గా ఉండే రోజా పది రోజులుగా మీడియాకు దూరంగా ఉండటంపై ఆరా తీయగా, ఈ విషయం వెల్లడైంది. కాలు బెణకడం వల్లే 10 రోజుల నుంచి రోజా నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## బెంగళూరు నుంచి తిరుపతికి
# హెలికాప్టర్ సర్వీస్



**బెంగళూరు, విశాల భారతి :** తిరుమల తీర్థయాత్రను సులభతరం చేయడానికి కొత్తగా బెంగళూరు నుంచి తిరుపతికి హెలికాప్టర్ సేవలు ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని హెచ్‌ఏఎల్ విమానాశ్రయం నుండి తిరుపతికి హెలికాప్టర్ ఈ సేవలను అందిస్తోంది. ఉదయం 9.15 నుండి 9.30 గంటల మధ్య బెంగళూరులోని హెచ్‌ఏఎల్ విమానాశ్రయంలో హెలికాప్టర్ బయలుదేరుతుంది. అదే రోజు సాయంత్రం 4 గంటల నుండి 4.15 గంటల మధ్యలో తిరుపతి నుండి బెంగళూరుకు బయలుదేరవచ్చు. తిరుపతికి బయలుదేరే హెలికాప్టర్‌లో ఐదుగురు ప్రయాణించడానికి అవకాశం ఉంది. హెలికాప్టర్ రైడ్ బెంగళూరుతిరుపతి నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. బెంగళూరు నుండి తిరుపతికి సుమారు నాలుగు గంటల నుంచి ఐదు గంటల ప్రయాణించడానికి సమయం పడుతుంది. హెలికాప్టర్ సేవతో తిరుమల వెళ్లే భక్తులు దాదాపు 1. 5 గంటల్లో తిరుపతి చేరుకోవడానికి అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు అంటున్నారు. తరువాత తిరుపతి నుంచి తిరుమలలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. బెంగళూరు నుంచి తిరుపతికి హెలికాప్టర్‌లో ప్రయాణించాలంటే జీఎస్టీ మినహా దాదాపు రూ.3, 50, 000 ఖర్చు అవుతుంది. రూ. 3, 50, 000 నుండి పూర్తి హెలికాప్టర్ అందుబాటులో ఉంది. రూ. 3. 50, 000 లక్షలకు ఒకేసారి ఐదుగురు ప్రయాణికులు వెళ్లవచ్చు. ఒంటరిగా వెళుతున్నప్పటికీ మీరు ఈ ప్రైవేట్ హెలికాప్టర్ పొందవచ్చు. ఫ్లైబ్లేడ్ ఇండియా వెబ్‌సైట్ ద్వారా బుకింగ్‌లు చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. వెబ్‌సైట్‌లో లేదా 18001025233లో బుకింగ్‌లు చేయవచ్చు. బుకింగ్‌లు కనీసం 24 గంటల ముందుగానే చేయాలి. దేశవ్యాప్తంగా యాత్రికులు తిరుపతి నగరానికి చేరుకుని తరువాత తిరుమల వెళ్లడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి తిరుపతిలోని విమానాశ్రయానికి రేణిగుంట విమానాశ్రయంకు చాలా మంది చేరుకుని తరువాత తిరుమల వెలుతున్నారు.

విశాల భారతి
vishalabharati
Telugu Daily
సోమవారం, 12 జూన్ 2023, హైదరాబాద్




# బీజేపి నాయకురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో..

- ఉచితంగా మినరల్ వాటర్ సౌకర్యం
- రామచంద్రాపురం సండే మార్కెట్లో ఏర్పాటు

**పటాన్ చెరు, విశాలభారతి:** రామచంద్రాపురం సండే మార్కెట్లో ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం బీజేపి మహిళా మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆదివారం సందర్భంగా సంతలో మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని గోదావరి అంజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ సండే మార్కెట్లో మంచినీటీ సదుపాయం అందుబాటులోకి లేకపోవడంతో సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి కోసం ఉచిత మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఆదివారం మినరల్ వాటర్ అందుబాటులో ఉంచబోతున్నామని, రైతులు వ్యాపారులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శి సరస్వతి, రవీందర్ రెడ్డి, రవికుమార్, భారతి నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, నారాయణ, శంకర్ రాములు, మల్లేష్, భూపాల్ రెడ్డి, కటిక శ్రీను, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు




# అధికార పార్టీ కౌన్సిలర్ల బరితెగింపు

## వరదకాల్వను ధ్వంసం చేసి వెంచర్ ఏర్పాటు
## అమాయక ప్రజలను మోసం చేస్తున్న వైనం
## చూసీచూడనట్లు వదిలేస్తున్న అధికారులు

**విశాలభారతి - తుర్కయంజాల్:** అధికార పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్ల బరితెగింపు అమాయక ప్రజల పాలిట శాపంగా మారింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రాజధాని నగరానికి ఆనుకొని ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదునుగా భావించిన అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు తెరలేపారు. వరద కాల్వలను, చెరువు శిఖం భూములను కారుచౌకగా కొనుగోలు చేసి, వెంచర్లుగా మలిచి అమాయక ప్రజలకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూరులోని సర్వే నెంబర్ 91లో మునగనూరుకు చెందిన ఓ కౌన్సిలర్లు, యంజాల్‌కు చెందిన మరో కౌన్సిలర్, ఇంకో రియల్టర్ కలిసి సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేశారు. అయితే ఈ వెంచర్ పూర్తిగా బఫర్ జోన్‌లో ఉండటం గమనార్హం. తొర్రూరు ఎర్రగుంట అలుగు నుంచి కిందనున్న పోతుగుంటకు వచ్చే వరద కాల్వను పూర్తిగా ధ్వంసం చేసి మట్టితో పూడ్చేశారు. ఎర్రగుంట చెరువు ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. ఏ చిన్న వర్షం వచ్చినా అలుగు పారుతుంది. ఈ నేపథ్యంలో కిందనున్న పోతుగుంటకు నీరు వచ్చే దారులన్నీ మూసుకుపోయిన పరిస్థితి కనబడుతోంది. ప్రస్తుతం అలుగు ఎర్రగుంట అలుగు పారితే పక్కనున్న ఇళ్లన్నీ పూర్తిగా మునగడం తథ్యంగా కనబడుతోంది.



**'మోసపోయిన ప్రజలు'**

వరద కాల్వను కారుచౌకగా కొన్న అధికార పార్టీ నేతలు... ప్లాట్లుగా మలిచి రూ.కోట్లు గడించినట్లు తెలుస్తోంది. అయితే ఈ వెంచర్ వరద కాల్వను ఆక్రమించి ఏర్పాటు చేశారన్న విషయం తెలియక అమాయక ప్రజలు ఇందులో ప్లాట్లను కొనుగోలు చేశారు. కాల్వ ఉన్న సంగతి కొనుగోలుదారులకు తెలియకుండా జాగ్రత్త పడ్డారు రియల్టర్లు. విషయం బయటకు పొక్కిన తర్వాత రియల్టర్లపై ప్లాట్ల కొనుగోలుదారులు తిరగబడినా ప్రయోజనం లేకుండా పోయింది. అధికార పార్టీ కౌన్సిలర్ల బెదిరింపులకు భయపడి కొనుగోలుదారులు ఏం చేయలేని పరిస్థితి నెలకొన్నదని చెబుతున్నారు స్థానికులు.

### చూసీచూడనట్లు అధికారుల తీరు

ఎర్రగుంట నుంచి వచ్చే వరద కాల్వను పూడ్చేసి యథేచ్ఛగా వెంచర్లుగా మలిచి విక్రయిస్తున్నా, అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ధారించి ఆక్రమణలకు, కబ్జాలకు, పూడ్చివేతలకు గురికాకుండా చూడాల్సిన ఇరిగేషన్ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్వోసీ సర్టిఫికెట్లు అడ్డగోలుగా జారీ చేస్తూ దొంగలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# నేటి నుండి బండలగూడలో..

## పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

### ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన యాదగిరి యాదవ్, గూడెం మధు



**పటాన్ చెరు-, విశాలభారతి :** పటాన్ చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో నేటి నుండి మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమ ఆహ్వాన పత్రికను మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ తో కలిసి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి యాదవ్ మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా పరమత సహనాన్ని పెంపొందిస్తూ దేవాలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారాలతో బండలగూడ లో అయిదు ఆలయాలు నిర్మించారని తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారి కరుణాకటాక్షాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బండ్లగూడ అధ్యక్షులు గోపాల్, నాయకులు చంద్రశేఖర్, సాబేర్, విక్రం , భీమ్రాజ్, మల్లేష్, దశరథ్, సురేష్, భరత్, జీతయ్య, రఘు, జంగయ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు క్రాఫ్ట్ కోర్సులు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్
- కరీంనగర్ లో రాష్ట్ర స్థాయి టెక్నికల్ టీచర్స్ శిక్షణ కం ప్రదర్శన శిబిరం ప్రారంభం



**కరీంనగర్, విశాల భారతి :** విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు టెక్నికల్ క్రాఫ్ట్ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్లో రాష్ట్రస్థాయి టెక్నికల్ టీచర్స్ శిక్షణ కం ప్రదర్శన శిబిరాన్ని వినోద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థి దశలోనే క్రాఫ్ట్ కోర్సులను నేర్పించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసే అవకాశం ఉంటుందని అన్నారు. మ్యూజిక్, పెయింటింగ్, కార్పెంటరీ, ఎంబ్రాయిడరీ టైలరింగ్ టీవీ మొబైల్ రిపేర్ వంటి క్రాఫ్ట్ కోర్సులు పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని వినోద్ కుమార్ పేర్కొన్నారు. గతంలో క్రాఫ్ట్ కోర్సులు ఉండేవని, కానీ గత పాలకులు ఈ కోర్సులను బోధించే టీచర్స్ నియామకాలను నిలిపి వేయడంతో విద్యార్థులకు క్రాఫ్ట్ కోర్సులు నేర్పించే శిక్షకులు లేకుండా పోయారని వినోద్ కుమార్ తెలిపారు. రానున్న కాలంలో క్రాఫ్ట్ కోర్సులు పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందని, శిక్షణ ఇచ్చేందుకు క్రాఫ్ట్ టీచర్స్ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉందని వినోద్ కుమార్ అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపా హరి శంకర్, డి.ఈ.ఓ. దశరథ్, బీ ఆర్ ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, మధుసూదన్ రెడ్డి, దూలం సంపత్ గౌడ్, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# ఆశ్రమ పాఠశాలలో అపూర్వ కలయిక

## ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి జ్ఞాపకాలు



**ఆదిలాబాద్, విశాల భారతి :** ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల రాయిగూడలో చదువుకున్న 198889 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఇచ్చోడలోని ముస్తాపురే అశోక్ ఫాంహౌస్‌లో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి పూర్వ ఉపాధ్యాయులు, ముఖ్య అతిథిగా విశ్రాంత గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అభివృద్ధి అధికారి గటిక లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. పోశెట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ అత్యంత వెనక బడిన ఆదిలాబాద్ జిల్లాలో సేవలందించడం మరువలేని జ్ఞాపకమన్నారు. విద్యార్థుల్లో ముస్తాపురే అశోక్, మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ.. రోడ్డు రవాణా, విద్యుత్తు, వసతి సౌకర్యాలు లేనికాలంలో ఉపాధ్యాయులు చదువు చెప్పడంతో పాటు అంధకారంలో ఉన్న జీవితాలల్లో వెలుగులు నింపారని అన్నారు. వారు చేసింది ఉపాధ్యాయ వృత్తి మాత్రమే కాదు నిజమైన సేవలన్నారు. అలాంటి గురువులతో కలిసి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం అదృష్టమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువుల పాదాభిషేకం చేసి శ్రీఫలం, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ కుమారి, బాపురాజు, చంద్రశేఖర్ రెడ్డి, జుట్టు మహేందర్, రామేశ్వర్ రెడ్డి, మనోహర్ రావ్, నిషికాంత్‌తో పాటు విద్యార్థులు బిక్కులాల్, ఎస్.అశోక్, శారదా, గజానంద్, అర్జున్, వసంత్ పాల్గొన్నారు.

# క్షమాపణ డిమాండ్ చేసే వారికి సిగ్గుండాలి



- 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తూన్నందుకా?
- రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తులు చేస్తున్నందుకా?
- కాంగ్రెస్ పార్టీ నేతలు గల్లీ నుండి ఢిల్లీ వరకు ముక్కు నేలకు రాయాలి
- లక్ష సార్లు క్షమాపణ చెప్పాలి మంత్రి జగదీష్ రెడ్డి

**నల్లగొండ, - విశాలభారతి:** క్షమాపణలు ఎందుకు చెప్పాలి. నిజంగా క్షమాపణలు చెప్పాల్సి వస్తే కాంగ్రెస్ పార్టీయే చెప్పాల్సి ఉంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలకు ఉద్బోధించారు. క్షమాపణలే కాదు ఇక్కడి నుండి ఢిల్లీ దాకా ముక్కు నేలకు రాయాలని ఆయన డిమాండ్ చేశారు.క్షమాపణలు కుడా ఒక్కసారి కాదని లక్ష సార్లు క్షమాపణలు, వెయ్యి సార్లు గల్లీ నుండి ఢిల్లీ వరకు 50 వేల సార్లు ముక్కు నేలకు రాసుకుంటూ పోతే తప్ప ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఏడూ దశాబ్దాలుగా చేసిన పాపానికి విముక్తి కలుగుతుందని ఆయన ఎద్దేవాచేశారు. ఆదివారం సాయంత్రం నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్థానిక శాసనసభ్యులు క్యాంప్ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.శాసమండలి సభ్యులు యం సి కోటిరెడ్డి,జిల్లా బి ఆర్ యస్ అధ్యక్షుడు, దేవరకొండ శాసనసభ్యులు రవీంద్ర నాయక్, శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి,యన్. భాస్కర్ రావు,నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,నోముల భగత్,మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులతో కలసి మంత్రి జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ క్షమాపణలు ఎందుకు చెప్పాలి.వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నందుకా,వరుసగా 16 పంటలకు సాగు %ాaశ్రీ%97అందించినందుకా ఉమ్మడి నల్లగొండ జిల్లా ను ఫ్లోరోసిస్ నుండి విముక్తి చేసి మిషన్ భగీరథతో ఇంటింటికి మంచినీరు అందించి దాహార్తి ని తీర్చినందుకా ఎందుకు క్షమాపణలు చెప్పాలో చెప్పాలని ఆయన నిలదీశారు.హైదరాబాద్ కు పోవాలి అంటే పాస్ పోర్టులు కావాలి..వీసాలు కావాలి అన్నోడికి వంగి వంగి దండాలు పెట్టి పదవుల కోసం పెదవులు మూసుకుని సాగర్ ఎడమ కాలువా రైతాంగాన్ని వంచనకు గురి చేసింది మీరు,మీ బాస్ రాజశేఖర్ రెడ్డి కాదా అని ఆయన ప్రశ్నించారు.తెలంగాణా ఏర్పాటుకు అడ్డుపడిన రాజశేఖర్ రెడ్డి 2014 మీరు పొత్తు పెట్టుకున్న చంద్రబాబులే కదా కృష్ణా జలాల దోపిడీకి పాల్పడ్డది. అటువంటి జలదోపిడి గాళ్ల జలదోపిడిని నిలువరించ లేక పోయినందుకు మీరు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సింది మేము కాదని ఆయన స్పష్టం చేశారు. అసలు క్షమాపణ పదం ఉచ్చరించేందుకే కాంగ్రెస్ నాయకులు సిగ్గు పడాలని ఆయాన అన్నారు.మీరు అధికారంలో ఉన్నప్పుడే కదా ఓ కుగ్రామంలో పుట్టి ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఫ్లోరోసిస్ కబళించింది అని ఆయన నిలదీశారు.మీ నిర్వాకంతోటే కదా రెండు లక్షల పై చిలుకు జనానికి నడ్డి విరిగి ఎముకలు గుల్ల అయింది నిజం కాదా అని కాంగ్రెస్ నేతలపై విరుచుకు పడ్డారు. అటువంటి నిర్వాకం నుండి మునుగోడు తో సహా ఉమ్మడి నల్లగొండ జిల్లాను బయట పడేసి సురక్షిత నీరు తాపిస్తున్నందుకా క్షమాపణలు అంటూ ఆయన దుయ్యబట్టారు.టెల్ ఎండ్ పేరుతో సాగర్ ఎడమ కలువా మొదటి తూము రాజవరం మొదటి మేజర్ ను 55 ఏండ్లుగా ఎండపెట్టిన పాపం కాంగ్రెస్ పార్టీది కాదా...40 ఏళ్లుగా జిల్లాను శాసించిన మీది కాదా ప్రజలకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యావరణం అనుమతులు, పై ప్రాంతంలో పులులు భయపడతాయంటూ కాకమ్మ కబుర్లతో కాలయాపన చేసింది చాలక సొరంగం అంటూ సోది ముచ్చట్లు చెబుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 40 లక్షల పై చిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడితో రికార్డ్ సృష్టించిన విషయం నిజం కాదా అని ఆయన కాంగ్రెస్ నేతల మీద ఫైర్ అయ్యారు. వరసగా 16 పంటలకు నీళ్లు యిచ్చి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దని అటువంటి మహానేత ముందు వంగబడి 1000 సార్లు ముక్కు నేలకు రాస్తే తప్ప మీరు చేసిన పాపం నుండి విముక్తి కాజలరన్నారు.అంతెందుకు 2014 కు పూర్వం ఏనాడైనా లాఠీ చార్జీలు లేకుండా విత్తనాలు,ఎరువులు అందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ రికార్డ్ లో ఉందా అని ఆయన పేర్కొన్నారు.వేసవికాలంలో నీటి దాహార్తిని తీర్చాలి అంటూ అడపడచులు రోడ్డెక్కి హాహాకారాలు చేసిన రోజులు ఒక్కసారి యాది చేసుకోవాలని ఆయన కాంగ్రెస్ నేతలకు ఉపదేశించారు. అటువంటి పార్టీ ,ఆ పార్టీ నాయకులు పార్టీలో ఉనికి కోసం పాదయాత్రలు,పరుగు పందేలు పెట్టుకుంటే తప్పు లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి అంటేనే ప్రజల పక్షాన ఆ పార్టీని నిలదీయాల్సిన పరిస్థితి ఏర్పడిరదన్నారు.ఉద్యోగ నియామకాల గురించి మాట్లాడే నైతికతే కాంగ్రెస్ పార్టీకి లేదు అన్నారు.2014 వరకు ఉమ్మడి రాష్ట్రంలో ఎలుబడిలో ఉన్న కాంగ్రెస్ వచ్చిన ఉద్యోగాలు వచ్చినట్లు ఆంధ్రా పాలకులకు వయపడి ఆంధ్రా వారిని నియమించి తెలంగాణాలో నిరుద్యోగాన్ని పెంచి పోషించారని ఆయన ఫైర్ అయ్యారు. మీరే ఉద్యగ నియామకాలు ఎప్పటికప్పుడు చేపడితే రాష్ట్ర విభజన నాటికి అన్ని ఖాళీలు ఎందుకు ఉన్నాయో సమాదనం చెప్పాలని మంత్రి జగదీష్ రెడ్డి డిమాండ్ డిమాండ్ చేశారు.అదే తెలంగాణా ఏర్పడ్డాకా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో జరిగిన లక్షా 35 వేల ఉద్యోగ నియమాకాలలో పూర్తిగా తెలంగాణా బిడ్డలే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే దరణిని రద్దు చేస్తాం..యాదాద్రి పవర్ ప్లాంట్ ను బ్లాస్ట్ చేస్తానన్నందుకే కాబోలు ఈ నాయకులను,ఆ పార్టీని ప్రజలు పూర్తిగా నిరుద్యోగులుగా మార్చారని మంత్రి జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతల పై వ్యంగాస్త్రాలు విసిరారు.

# ప్రజలు మెచ్చేలా మున్సిపాలిటీ అభివృద్ధి

## అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి
## రూ. కోటి 75 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**పటాన్ చెరు-, విశాలభారతి :** అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో ప్రజలు మెచ్చేలా అభివృద్ధి పనులు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓడిఎఫ్ కాలనీ, సాయి భగవాన్ కాలనీలలో ఒక కోటి 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, సాయి కృపా కాలనీలో 15 లక్షల రూపాయలతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో శరవేగంగా నూతన కాలనీలు, ఏర్పడుతున్నాయని, ఇందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు బిజిలి రాజు, అనిరుద్ రెడ్డి, కృష్ణ, నవనీత జగదీష్, చంద్రకళ గోపాల్, రాములు, బాలమని బాలరాజు, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# 9 ఏండ్ల మోడీ పాలనలో దళితులకు పెద్దపీట

**బీజేపీ యస్సిమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొప్పుబాష**



**హైదరాబాద్,- విశాలభారతి :** బీజేపీ యస్సిమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొప్పుబాష హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాష మాట్లాడుతూ.. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం 12 మంది ఎస్సీ ఎంపీలకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించి ఎస్సీ సమాజాన్ని అధికారంలో భాగస్వామ్యం చేసిందన్నారు. భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారి స్మృతి స్థలాలను పంచ తీర్థ క్షేత్రాలుగా అభివృద్ధి చేసి అంబేద్కర్ గారి ఆలోచన విధానాన్ని వారి జీవిత సందేశాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకుపోతా ఉన్నదన్నారు. 60 సంవత్సరాలు ఈ దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్కు అంబేద్కర్ గారికి భారతరత్న ఇవ్వడానికి మనసు రాలేదు తొమ్మిది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీలను మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించలేదన్నారు. ఎస్సీలను వ్యాపారవేత్తలుగా చేసే లక్ష్యాలతో నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం స్టాండప్ ఇండియా పథకం ద్వారా 31 12 2022 నాటికి తెలంగాణలో 472 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేసి 1823 మంది ఎస్సీలను దిగ్గజ వ్యాపారవేత్తలను చేసిందన్నారు. ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి ఎస్సీల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముద్ర యోజన పథకం ద్వారా 30 12 2022 నాటికి 209.65 కోట్ల రూపాయల ముద్ర రుణాలు అందించి 12,466 మంది ఎస్సీ యువకులను వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. మోడీ ప్రభుత్వం 2017 లో నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవం గా ప్రకటించి మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగం పై తనకున్న నమ్మకాన్ని విశ్వాసాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని, అయితే తెలంగాణలో కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో మాత్రం ఎస్సీలపై వివక్ష ధోరణి ఉట్టిపడిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ లోన్లను, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పథకాన్ని నీరుగార్చి కేసిఆర్ ఆర్భాటంగా ప్రారంభించిన దళిత బంధు పథకానికి నిధులు,విధానాలు లేక విలవిలబోతుందని అన్నారు. దళిత బంధు పథకంలో అవినీతి జరిగిందని ఎమ్మెల్యేలు ఎవరెవరు కమిషన్లు తీసుకున్నారో వారి పేర్లు తన దగ్గర ఉన్నాయని స్వయంగా ప్రకటించిన కేసీఆర్ అవినీతి ఎమ్మెల్యేల లిస్టు ఇప్పటికీ ఎందుకు బయట పెట్టలేదని కేసీఆర్ ని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో నేటికీ 18 లక్షల దళిత కుటుంబాలలో ఇంకా సుమారు 11 లక్షల కుటుంబాలు అంగుళం భూము లేకుండా దుర్భర జీవితాన్ని గడుపుతున్నాయని మూడు ఎకరాల భూమి ఇస్తే ఎస్సీలు సమాజంలో గౌరవం పొందుతారని ఎస్సీలను అగౌరపరచాలనే ఉద్దేశంతో కేసీఆర్ దళితులకు మూడెకరాల భూమి పథకాన్ని అంతం చేశారన్నారు. ఎస్సీలకు ఇవ్వడానికి ప్రభుత్వ భూములు లేవని కుంటి సాకులు చెప్పిన కేసీఆర్ నేడు రియలేస్టేట్ వ్యాపారం చేయడానికి మాత్రం భూములులెక్కడివన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి తెలంగాణలో ఎస్సీ కార్పొరేషన్ నుండి ఒక్క లోను కూడా ఇవ్వలేదని అన్నారు. తెలంగాణ భాషలో చెప్పాలంటే మోడీ పాలనకు కేసీఆర్ పాలనకు నక్కకు నాగ లోకానికి ఉన్న తేడా ఉందని అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ లో భాగంగా ప్రతి దళిత కుటుంబాన్ని మేల్కొలుపుతూ మోడీ గారి సుపరిపాలన మరియు కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలు తెలియచేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాంతికిరన్, ఉపాధ్యక్షులు గుటూరు అంబేద్కర్,గడ్డల అంజిబాబు, ముఖ్య నాయకులు ఉన్నారు.



# నర్సింగ్ విద్యార్థిని దారుణహత్య

**వికారాబాద్ జిల్లాలో ఘటన**
**శనివారం మిస్సింగ్.. ఆదివారం చెరువులో మృతదేహం**


**విశాలభారతి, హైదరాబాద్:** వికారాబాద్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. నర్సింగ్ చదివే ఓ విద్యార్థిని హత్యకు గురైంది. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటు వెళ్లిన ఆమె ఆదివారం ఉదయం నీటి కుంటలో శవమై తేలింది. అయితే ఆమె మృతదేహంపై రక్తపు మరకలు ఉండడంతో హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. కానీ ఆమెను ఎవరు, ఎందుకు, ఎలా హత్య చేశారు ఇంకా తెలియరాలేదు.

**అసలేం జరిగిందంటే?**

వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాల్లాపూర్ గ్రామానికి చెందిన 19 ఏళ్ల శిరీష.. శనివారం రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతసేపవుతున్నా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. తెలిసిన స్నేహితులు, బంధువులు అందరికీ ఫోన్ లు చేశారు. ఎక్కడా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. అయితే ఆదివారం రోజు ఉదయం గ్రామ సమీపంలోని నీటి కుంటలో శిరీష శవమై తేలింది. విషయం గుర్తించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు.. మృతదేహన్ని బయటకు తీశారు. అయితే శిరీష మృతదేహంపై రక్తపు మరకలు ఉండడంతో ఆమెను ఎవరో హత్య చేసినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎస్సై విఠల్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముందుగా హత్య చేసి ఆ తర్వాతే మృతదేహన్ని కుంటలో పడేసినట్లు పోలీసులు చెబుతున్నారు. శిరీష ఇంటర్మీడియట్ పూర్తి చేసి వికారాబాద్ లోని ఓ ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ శిక్షణ తీసుకుంటోంది. అయితే ఈమెను ఎవరు, ఎప్పుడు, ఎలా చంపారో త్వరలోనే తేలుస్తామని పోలీసులు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

# ఒక్క అవకాశం కల్పించండి మీ అందరి బాధ్యత నాదే

జగన్నాథ స్వామి 12 వ వార్షకోత్సవం సందర్భంగా మహా అన్నదానం ప్రారంభించిన పిల్లుట్ల
గ్రామ ప్రజలు యువత సుఖసంతోషాలతో సిరిసంపదలతో వర్ధిల్లాలి
దొండపాడు గ్రామానికి అని విధాలుగా అండగా ఉంటా పిల్లుట్ల రఘు





**హుజూర్ నగర్ - విశాలభారతి :** సూర్యపేట జిల్లా చింతల పాలెం మండలం దొండపాడు గ్రామంలోనీ జగన్నాథ స్వామి 12 వ వార్షకోత్సవం సందర్భంగా హుజూర్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లుట్ల రఘు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం కార్య క్రమం ప్రారంభించి దాదాపు 3,000 మందికి పైగా అన్న ప్రసాదం భక్తులందరికీ అందించి ప్రజల ఆశీస్సుల తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంకి అండగా నిలుస్తానని దొండపాడు గ్రామనికి గంగమ్మ తల్లి జాతరకి 1,00,000 రూపాయలు , నాగామయ్య దేవాలయము కి ఆర్థిక సహాయం చేశాం,చర్చ్ కి పెయింటింగ్ అందిచం , పీర్ల పండుగకు సహకారం అందించామని అన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశామని నిరుపేద కుటుంబలకు ఆర్థిక సాయం అందించం అని విద్యార్థుల కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి పార్టీలకతీతంగా కులమతాలకు అతీతంగా పరిపాలన చేసి ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి అండగాఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో ఫౌండేషన్ ఇంఛార్జి గ్రామం పెద్దలు గుడి కమిటి సభ్యులు ఓజో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.




# సామాజిక సేవలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

సామాజిక సేవలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం పెరగాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతీ నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో మ్యాక్ ఫ్రంట్ లైన్ టీం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన పీపుల్స్ ఎలైట్ ఈవెంట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి తోడుగా సామాజిక సేవలో మ్యాక్ ఫ్రంట్ లైన్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సమాజం మాకు ఏమి ఇస్తుంది అని ఆలోచించకుండా సమాజానికి నేను ఏమి చేస్తున్నాను అన్న సమున్నత లక్ష్యంతో ముందుకు రావడం నేటి యువతరానికి స్ఫూర్తిని అందిస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పారిశుద్ధ్య కార్మికులను బహుమతులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, రామచంద్రపురం సిఐ నరేందర్ రెడ్డి, బిహెచ్ఇఎల్ రిటైర్డ్ ఈడి ఉదయ్ కుమార్, టిఆర్ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పృథ్వీరాజ్, టీం సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.



# అతి తీవ్ర తుపానుగా 'బిపోర్ జాయ్'

**5 రాష్ట్రాల్లో భారీ వర్షా లు**

**విశాలభారతి, ఏపీ:** అరేబియా సముద్రంలో కేంద్రీకృతమైన తీవ్ర తుపాను 'బిపోర్ జాయ్' మరో 12 గంటల్లో మరింత తీవ్రరూపం దాల్చి అతి తీవ్ర తుపానుగా మారనుందని శనివారం భారత వాతావరణశాఖ తెలిపింది. ఇది 24 గంటల్లో ఉత్తరఈశాన్య దిశగా కదులుతుందని వెల్లడించింది. వాతావరణశాఖ వివరాల ప్రకారం.. వచ్చే 3 రోజుల్లో ఉత్తరఉత్తరపశ్చిమ దిశగా తుపాను కదులుతుంది. ప్రస్తుతం అది గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు 600 కిలోమీటర్ల దూరంలో ఉంది. పోర్‌బందర్‌కు 200300 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లిపోతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం.. గుజరాత్‌ను తాకకపోవచ్చు. అయితే రానున్న 5 రోజుల్లో ఆ రాష్ట్రంలో భారీ వర్షాలు పడతాయి. వచ్చే 5 రోజులూ అరేబియా సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి. తుపాను ప్రభావంతో కర్ణాటక, గోవా, మహారాష్ట్రల్లోని తీర ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు పడతాయి. బలమైన ఈదురు గాలులూ వీస్తాయి. భారీ అలల కారణంగా గుజరాత్‌లోని ప్రముఖ పర్యాటక ప్రదేశం తితాల్ బీచ్‌ను ఈ నెల 14 వరకూ మూసివేస్తున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. తుపాను కారణంగా సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. పోర్‌బందర్, గిర్, సోమనాథ్, వల్సాద్‌లకు జాతీయ విపత్తు దళ బృందాలను అధికారులు పంపారు

# తెలంగాణ చరిత్ర మహోన్నతం



- 20 కోట్ల ఏండ్ల నాటి ఆనవాళ్లున్నాయి
- 5 సంపుటాలుగా తెలంగాణ చరిత్ర
- ప్రచురించిన భారత జాగృతి సంస్థ

**విశాలభారతి, హైదరాబాద్:** తెలంగాణ చారిత్రక వారసత్వం మహోన్నతమైనదని, కోట్లాది సంవత్సరాల చరిత్రకు తెలంగాణ సాక్ష్యంగా నిలవడం ఆనందంగా ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. దాదాపు 20 కోట్ల సంవత్సరాల క్రితం చారిత్రక ఆనవాళ్లు కూడా తెలంగాణలో లభ్యం కావడం చాలా గర్వకారణమని అన్నారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలిపే విధంగా.. భారత జాగృతి సంస్థ తెలంగాణ చరిత్ర పుస్తకాన్ని 5 సంపుటాలుగా ప్రచురించింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీఎం కేసీఆర్ ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రకారులు చేస్తున్న కృషి చాలా అభినందనీయమని సీఎం కేసీఆర్ అన్నారు. ఆయా కాలాలలో కొనసాగిన సామాజిక పరిస్థితులు, పరిపాలన రీతులు, నాటి దార్శనికత అర్థం చేసుకుంటే.. రేపటికి మనకు దారి చూపుతాయని అన్నారు. మన చరిత్రను అర్థం చేసుకోవడం ద్వారా వర్తమానాన్ని అవగాహన చేసుకుంటే మనకు దారి చూపుతాయని కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను అభినందించారు. అలాగే జాగృతి చరిత్ర విభాగం బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భారత జాగృతి చరిత్ర విభాగం గత 6 ఏళ్లుగా రాష్ట్రంలోని అనేక చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. చరిత్రకారుడు, రచయిత అయిన శ్రీమోజు హరగోపాల్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పరిశోధన చేసి ఈ పుస్తకాలకు రూపకల్పన చేశారు. ఇందుకు మామిడి హరికృష్ణ, వేముగంటి మురళీకృష్ణ సంపాదకత్వం వహించారు. చరిత్ర కోసం ఆయా ప్రదేశాలలోని శిలాజాలు, కట్టడాలు, శాసనాలు, నాణాలు, గ్రంథాలతో సహా అన్ని రకాల చారిత్రక ఆధారాలను అధ్యయనం చేసినట్లు వాళ్లు సీఎం కేసీఆర్‌కు తెలిపారు.

# దాచుకోవడం దోచుకోవడమే బీఆర్ఎస్ సిద్ధాంతం


అధికారం కోసం దేశద్రోహులతో చేతులు కలిపే పార్టీ కాంగ్రెస్
బీజేపీని ఎదుర్కొనే దమ్ములేక కాంగ్రెస్‌ను పెంచి పోషిస్తున్న కేసీఆర్
9 ఏళ్ల మోదీ పాలనలో తెలంగాణకు పెద్ద ఎత్తున నిధులిచ్చింది
గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులవల్లే..
తెలంగాణ అభివృద్ధి కేంద్రం పూర్తిగా సహకరిస్తున్నా బీఆర్ఎస్ దుష్ప్రచారం
ఇంటింటికీ వెళ్లి మోదీ 9 పాలనలో జరిగిన మేలును వివరించండి
వేములవాడ మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనున్న తేడాను వివరించిన ప్రకాశ్ జవదేకర్



**సిరిసిల్ల - విశాలభారతి :** ''దాచుకోవడం దోచుకోవడమే బీఆర్ఎస్ సిద్ధాంతం. అధికారం కోసం దేశద్రోహులతో చేతులు కలిపే పార్టీ కాంగ్రెస్. ఆ రెండు పార్టీలు నాణేనికి బొమ్మ బొరుసులాంటివి. ఆ రెండిరటినీ వేరు చేసి చూడలేం. రాబోయే ఎన్నికల్లో కలిసే పోటీ చేయబోతున్నాయి''అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. బీజేపీని నేరుగా ఎదుర్కొనే దమ్ములేక కాంగ్రెస్ ను కేసీఆర్ పోషిస్తున్నారని, బీఆర్ఎస్ గెలిచే పరిస్థితి లేనిచోట కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ పెద్ద ఎత్తున డబ్బులిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ సింగిల్ గానే పోటీ చేస్తుందని, అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేములవాడలోని భీమేశ్వర గార్డెన్ లో పార్టీ సీనియర్ నేతల సమావేశం జరిగింది. బండి సంజయ్ తోపాటు కేంద్ర మాజీమంత్రి ప్రకాశ్ జవదేకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రతాప రామక్రిష్ణ, రాష్ట్ర నాయకులు తుల ఉమ, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, కుమ్మరి శంకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులందరినీ బండి సంజయ్, ప్రకాశ్ జవదేకర్ ఆప్యాయంగా పలకరిస్తూ మోదీ తొమ్మిదేళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే ముందు వరకు గ్రామాల్లో ప్రజలకు అవసరమైనవన్నీ సమకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం ప్రధానమంత్రి మోదీదే. టాయిలెట్స్, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, 5 కిలోలో ఉచిత బియ్యం, కరెంట్, ఉపాధి హామీ, గ్రామీణ సడక్ యోజన రోడ్లు, రైతు వేదిక, పల్లె ప్రకృతి వనం, హరిత హారం, వైకుంఠధామాల నిర్మాణానికయ్యే నిధులన్నీ ఇస్తోంది కేంద్రమే. కరోనా సంక్షోమ సమయంలో ప్రజలను కాపాడేందుకు కరోనా వ్యాక్సిన్ అందించారు. 2 వందల కోట్లకుపైగా కరోనా డోసులను ఉచితంగా పంపిణీ చేయడమే కాకుండా దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించేందుకు ఆత్మనిర్భర్ భారత్ పేరిట 20 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీని ప్రకటించారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద ప్రతి రైతు అకౌంట్లో 6 వేల రూపాయల చొప్పున దేశమంతా లక్ష కోట్ల రూపాయల సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేశారు.. ఇవిగాకుండా సబ్సిడీ ఎరువులు అందిస్తూ ఒక్కో ఎకరానికి 24 వేల రూపాయల ప్రయోజనం.. ముద్ర రుణాలు, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా కార్యక్రమాలు, 5వ స్థానానికి చేరిన భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతూ 2047 నాటికి నెంబర్ వన్ గా మార్చేందుకు క్రుషి చేశారు. మోదీ 9 ఏళ్ల పాలనలో తెలంగాణ ప్రజలకు ఎంతో మేలు జరిగింది. నాబార్డు ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన కోసం 16 వేల కోట్లు కేటాయించింది. జాతీయ రహదారుల నిర్మాణానికి 1 లక్షా 10 వేల కోట్ల ఖర్చు చేసింది. 3 లక్షల ఇండ్లు మంజూరు చేసింది. 11 లక్షల 50 వేల కుటుంబాలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చింది. 30 లక్షల టాయిలెట్లను నిర్మించింది. ఇప్పటి వరకు 9 వేల కోట్ల రూపాయల విలువైన 25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పేదలకు ఉచితంగా పంపిణీ చేసింది. ప్రధానమంత్రి సమ్మాన్ యోజన కింద 40 లక్షల మంది రైతుల ఖాతాల్లో దాదాపు 8 వేల కోట్లు జమ చేసింది... జాతీయ ఉపాధి హామీ పథకం కింద 25 వేల కోట్ల ఖర్చు చేసింది.... పీఎం స్వనిధి కింద 5 లక్షల మందికిపైగా ముద్ర రుణాల కింద 6 వందల కోట్లు ఆర్థిక సాయం.. 7 కోట్ల 72 లక్షల కరోనా డోసులు... 6 వేల 338 వందల కోట్లతో రామగుండం ఎరువుల పునరుద్ధరణ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా తెలంగాణపై ఉన్న ప్రత్యేక అభిమానంతో గత 9 ఏళ్లలో 3 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసింది. ఇట్లా చెప్పుకుంటూ పోతే....తెలంగాణ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తోంది. తెలంగాణ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తోంది. పాజిటివ్ ధృక్పథంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా ఇంటింటికీ బీజేపీ పేరుతో విస్తృతంగా కరపత్రాలను పంపిణీ చేయబోతున్నాం. ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో ఏర్పడబోయేది బీజేపీ ప్రభుత్వమే. కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు సిద్ధాంతాల్లేవు. దాచుకోవడం దోచుకోవడమే బీఆర్ఎస్ సిద్ధాంతం. అధికారం కోసం దేశద్రోహులతో చేతులు కలిపే పార్టీ కాంగ్రెస్. ఆ రెండు పార్టీలు ఒక్కటే. ఆ రెండిరటినీ వేరు చేసి చూడలేం. కలిసే పోటీ చేయబోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఢల్లీలో గల్లీలో లేదు. ఆ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారు. బీఆర్ఎస్ గెలిచే పరిస్థితి లేనిచోట కాంగ్రెస్ అభ్యర్థులకు డబ్బులిస్తోంది. బీజేపీని నేరుగా ఎదుర్కొనే దమ్ములేక కాంగ్రెస్ ను కేసీఆర్ పోషిస్తున్నడు. బీజేపీ సింగిల్ గానే పోటీ చేస్తుంది. అధికారంలోకి రావడం ఖాయం' అని బండి సంజయ్ అన్నారు. ప్రకాశ్ జవదేకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనున్న తేడాను వివరించారు. పేదల కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం మోదీ అయితే... నీళ్లునిధులునియామకాల పేరుతో రాష్ట్రం ఏర్పడితే వాటికే తిలోదకాలిచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. తెలంగాణ ప్రజల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి ఇస్తే... అవినీతికి ఏటీఎంగా మార్చుకున్నారు. మోదీ కేబినెట్ లో ఒక్క మంత్రిపై కూడా అవినీతి మచ్చలేదు.. కేసీఆర్ కేబినెట్ లో అవినీతి ఆరోపణలు లేని వారే లేరు. మోదీకి కుటుంబం ఉన్నా.. ప్రజల కోసమే పనిచేశారు. ఆయనది దేశభక్తి కలిగిన ప్రభుత్వం. కేసీఆర్ విషయానికొస్తే.. ఆయనది పూర్తిగా కుటుంబ పాలన. అవినీతి ప్రభుత్వం. ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ల ద్వారా 60 వేల కోట్లు ఇస్తే తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆరోపించడం సిగ్గు చేటు. తాడిత పీడిత ప్రజలకు సేవ చేస్తున్న పార్టీ బీజేపీ. కోట్లాది మందికి ముద్ర రుణాలు మంజూరు చేసింది. 40 లక్షల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి కింద 6 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేసింది. కరోనా సమయంలో ఉచితంగా కరోనా వ్యాక్సిన్ అందించి ప్రజల ప్రాణాలను మోదీ కాపాడితే... ఇంటికే పరిమితమైన వ్యక్తి కేసీఆర్. గత మూడేళ్లుగా ఉచితంగా బియ్యం అందిస్తున్న ప్రభుత్వం మోదీదే. కేసీఆర్ ప్రభుత్వం రుణమాఫీ, ఇంటింటికీ ఉద్యోగం, నిరుద్యోగ భ్రుతి, డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం, ఫ్రీ యూరియా, విత్తనాల హామీలను నెరవేర్చిందా? ... ఈ విషయాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన వాళ్లంతా సెల్ఫీ వీడియోలు తీసి మోదీకి థ్యాంక్స్ చెబుతూ సోషల్ మీడియాలో ప్రచారం చేయండి అని పిలుపునిచ్చారు.

# రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ ను విజయవంతం చేయాలి

## నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి




**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి:** రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ ను విజయవంతం చేయాలి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. సందర్భంగా ఆదివారం ఈరోజు కిసాన్ నగర్ లో ఉమ్మడి బాల్కొండ,ముప్కల్,మెండోరా లో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. సంచలనాత్మక హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్ 18 న నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పోటీలో నిజామాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాలతో పాటు గ్రామ గ్రామాన ఉన్న 16 నుండి 35 సంవత్సరాలు గల ప్రతి నిరుద్యోగ యువతీ యువకులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ యొక్క ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో నమోదు చేయించ దానికి జిల్లా కాంగ్రెస్ లోని అన్ని విభాగాలు జిల్లా మండల గ్రామస్థాయి అధ్యక్షులు కార్యదర్శులు మరి ముఖ్యంగా ఎన్.ఎస్.యు.ఐ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రతి నిరుద్యోగ యువతీ యువకులతో పాటు విద్యార్థిని విద్యార్థులను కలిసి వారికి ఆన్లైన్ ఉద్యోగ ప్రాముఖ్యతను తెలియజేసి వారి చేత అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేయించాలని నిజామాబాద్ జిల్లాలో 20వేల తగ్గకుండా రిజిస్ట్రేషన్లు చేయించాలని ఆయన కోరారు. ఈ పోటీలో పాల్గొనా లనుకునే అభ్యర్థులు ముందుగా 7661899899 గల నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్ లింక్ తో కూడిన ఒక ఎస్.ఎం.ఎస్(%జామీ%) ను పొందుతారని ఆ లింకు ద్వారా వారి వివరాలను %పీూచీూూూ% లేదా %జు=ూూూ=×% అనే రిఫరల్ కోడ్ ద్వారా అందులో జూన్ 17 వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రథమ బహుమతి కింద ల్యాప్ టాప్, ద్వితీయ బహుమతి కింద స్మార్ట్ ఫోన్, తృతీయ బహుమతి కింద ట్యాబ్ లెట్ తోపాటు ప్రతి నియోజకవర్గంలో 40 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని ప్రోత్సాహక బహుమతులలో 10 స్మార్ట్ వాచ్లు, 10 ఇయర్ పాడ్లు, 10 హార్డ్ డ్రైవ్ లు ,10 పవర్ బ్యాంకులు బహుకరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతుల కింద ఎలక్ట్రిక్ స్కూటర్లను కూడా బహుకరించడం జరుగుతుందని ఈ బహుమతిలను ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు నిసోనియా గాంధీ చేతుల మీదుగా హైదరాబాదులో ప్రధానం చేస్తారని ఆయన తెలియజేశారు. ఈ యొక్క ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కి 60 నిమిషాల్లో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసి ఉంటుందని అంశాలన్నీ కూడా భారతదేశ భౌగోళిక ,చరిత్ర, స్వాతంత్ర ఉద్యమం , తెలంగాణ సాంస్కృతి, చరిత్ర, సామాజిక ఉద్యమాల తోపాటు జనరల్ నాలెడ్జ్ కరెంట్ అఫైర్స్ మరియు అర్థమెటిక్ రీజనింగ్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ ఆన్లైన్ క్విజ్ పరీక్ష రాయడం ద్వారా భవిష్యత్తులో జరగబోయే పోటీ పరీక్షలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కావున నిజామాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 16 నుండి 35 సంవత్సరాలు గల విద్యార్థిని విద్యార్థు, యువతీ యువకులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని అలాగే క్విజ్ కాంపిటీషన్ కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే వాటి నివృత్తి కోసం 8142903456 మరియు 8142803456 నెంబర్లకు కాల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్కల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు క్యాతం గంగారెడ్డి ,బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ గారు,మెండోరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి ఎన్ ఎస్ యు ఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు వరదబట్టు వేణురాజ్ బోదేపల్లి రాజు, అబ్రార్ ముప్కల్ మండల మైనారిటీ ప్రెసిడెంట్, పోలా ప్రవీణ్ ముప్కల్ మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, మగ్గిడి ముత్యం రెడ్డి, ఎంపీటీసీ సాయి, మాజీ సర్పంచ్ రమేష్, చిట్టాపూర్ ప్రవీణ్ పోచంపల్లి నవీన్, ముత్యం రెడ్డి గోపాల్, డిసిసి డెలిగేట్ జైడి రవి, బద్దంసాగర్, లక్ష్మణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాహిత్య దినోత్సవం

## కార్యక్రమంలో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

**మేడిపల్లి - విశాల భారతి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా పీర్జాదిగుడా మున్సిపల్ కార్పోరేషన్ 25వ డివిజన్ లోని రచయితలను,పండితులను 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి సన్మానించారు..అనంతరం 25వ డివిజన్ లో వార్డ్ కమిటీ సమావేశంను కార్పొరేటర్ శ్రీ దొంతిరి హరిశంకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో యువజనుల కమిటీ,మహిళ కమిటీ,వయోజనుల కమిటీ మరియు ప్రముఖ వ్యక్తుల కమిటీలను ఎన్నుకోవడం జరిగింది,ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మేయర్ శ్రీ జక్క వెంకట్ రెడ్డి గారు విచ్చేశారు.. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కాలనీ ల అధ్యక్ష కార్యదర్శులు మహిళలు పెద్దలు యువకులు కాలనీ వాసులు 120 మంది పాల్గొన్నారు..

# చేతిరాతతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

## అందమైన చేతిరాత మన తలరాతను మారుస్తుంది

### కూనవరం సర్పంచ్ ఏనిక ప్రసాద్



**మణుగూరు- విశాల భారతి :** గత పది రోజులుగా భరోసా వెల్ఫేర్ సొసైటీ, కూనవరం సి యు పి ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి ఉచిత హ్యాండ్ రైటింగ్ సమ్మర్ క్యాంప్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూనవరం సర్పంచ్ ఏనిక ప్రసాద్ విచ్చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుండే హ్యాండ్ రైటింగ్ నేర్చుకోవడం వల్ల మంచి మార్కులు సాధించవచ్చని అన్నారు. హ్యాండ్ రైటింగ్ నేర్చుకోవడం వల్ల మనలో ఆత్మవిశ్వాసం పెరిగి, మనం పై చదువులు చదవడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. హ్యాండ్ రైటింగ్ మారడం వల్ల మన వ్యక్తిత్వంలో కూడా మార్పులు వస్తాయని, ఇది మన మనస్తత్వంలో మార్పు తీసుకువచ్చి, మనల్ని మంచి వ్యక్తులుగా తయారు చేస్తుందన్నారు. హ్యాండ్ రైటింగ్ ఇష్టపడి నేర్చుకున్నటువంటి విద్యార్థులను సర్పంచ్ ఏనిక ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్క విద్యార్థికి భరోసా వెల్ఫేర్ సొసైటీ నుండి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. అనంతరం చేతిరాత నిపుణులు హ్యాండ్ రైటింగ్ హుస్సేన్ ని ప్రత్యేకంగా అభినందిస్తూ మేమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారాస నాయకులు నవీన్ బాబు , భరోసా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అమీరుద్దీన్, భరోసా సభ్యులు జీఎం పిఏ రాంబాబు, జహీర్ ఖాన్, జయకర్ గఫూర్, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళా ధారణ హత్య



**విశాలభారతి వరంగల్ బ్యూరో - భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో పురాణం స్వరూప (40) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. పంచాయతీ కోసం కాలనీకి వచ్చిన మహిళపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి హతమార్చినట్లు సమాచారం. మృతురాలి భర్త చనిపోగా, రాజు, కిషోర్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అనుమతులు లేని వెంచర్లో శంకుస్థాపన పనులు నిలిపివేయాలి



**మునగాల - విశాలభారతి :** మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలోని ద్వారకా నగర్ వెంచర్ లో జరగబోయే శంకుస్థాపన కార్యక్రమం వెంటనే ఆపేయాలని సామాజిక ఉద్యమకారులు వేమూరి సత్యనారాయణ అన్నారు. గ్రామ పంచాయతీ నుండి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా గ్రామ పంచాయతీకి గతంలో కేటాయించిన స్థలాన్ని నేటి వరకు గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయకుండా మిగిలిన స్థలంలో అత్యంత విలువైన భూమిని ఒక ప్రైవేటు వ్యక్తికి గుడి నిర్మాణం సాకుతో కట్టబెట్టేందుకు కొందరు వ్యక్తులు చేస్తున్న శంకుస్థాపన కార్యక్రమం నిలుపుదల చేయాలని అన్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయపరంగా ఈ వెంచర్ లో ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రామ పంచాయతీకే చెందేలా చేసి గ్రామంలో ఉన్న అర్హులైన పేదవారికి స్థలం కేటాయించి ప్రభుత్వం ప్రకటించిన మూడు లక్షల రూపాయల ఇంటి నిర్మాణం పథకం వర్తింప చేసేలా చొరవ చూపాలని కోరారు.



# వైకుంఠం రథం అందజేసిన నేతాజీ యువజన సంఘం

**నిజామాబాద్ బ్యూరో-** విశాల భారతి: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివ నగర్ మండలంలోని భూంపల్లి గ్రామంలో నేతాజీ యువజన సంఘం సభ్యులు 3 లక్షల విలువ చేసే వైకుంఠ రథం గ్రామపంచాయతీకి అందజేశారు. గ్రామంలో తమ వంతు ఏదైనా సహకారం అందించాలని 32 మంది సభ్యులకు గల నేతాజీ సంఘ సభ్యులు నిరుపేదలకు చనిపోతే స్మశాన వాటికకు తీసుకువెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని దీనితోపాటు చివరి మజిలీ తమ వంతు సహకారం అందజేయాలని ఉద్దేశంతో వైకుంఠ రథం తయారు చేయించి అప్పగించారు.గ్రామంలో నిరుపేదలు చనిపోతే స్మశాన వాటికకు తీసుకువెళ్లడం ఇబ్బందిగా భావించి తమ వంతు సహకారం అందించడం జరిగిందని వారు పేర్కొన్నారు. అనంతరం నేతాజీ యువజన సంఘ సభ్యులకు గ్రామ పెద్దలు అభినందించారు. అంతేకాకుండా వైకుంఠ రథాన్ని ఉంచడానికి అవసరమైన షెడ్డు కు విరాళాలు సేకరించి ఏర్పాటు చేస్తామని గ్రామ పెద్దలు ఒప్పుకున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం సంఘ సభ్యులు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మొరం మాఫియా...

## చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు ○ మాకెవరు అడ్డు లేరని ఇదేచంగా చెరువుల్లో అక్రమమరం తవ్వకాలు



అమృతాపూర్లో నల్ల మట్టి గురించి గొడవపడుతున్న గ్రామస్తులు వడ్డెర కాలనీ వాసులు

**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి.:** చేసేదే ఇల్ గల్ పని... అది కూడా సక్రమంగా చేద్దామంటే ఎలా? అందులో మళ్లీ వాటాలు.. నీకెంత? నాకెంత? అటువంటి సమస్యలు రోజు వారి రిత్యా నిజామాబాద్ జిల్లాలో జరుగుతూనే ఉన్నాయి. దీంతోపాటు మంజీరా వాగు ఇసుక రవాణా అక్రమంగా జరుగుతున్న ట్లు సమాచారం. మంజీరా వాగు ఎస్గీ ఇసుకతో ఇసుకతో మధ్యవర్తులకు లక్షల్లో లాభం ఉంటుంది. ఇది కూడా అక్రమంగానే జరుగుతున్నట్లు స్థానికులు సైతం పేర్కొంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క దశాబ్ద ఉత్సవాలు జరుపుతుండగా నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలం అమృతపూర్ గ్రామంలో నల్ల మట్టి ని చెరువులో నుంచి తరలించడంలో అమృతాపూర్, అమృతాపూర్ గ్రామానికి ఆమ్లెట్ విలేజ్ గా ఉన్న వడ్డెర కాలానికి నల్ల మట్టికి సంబంధించిన నగదును అమృతాపూర్ గ్రామానికి 75% వడ్డెర కాలానికి 25% వచ్చిన డబ్బులో ఇరు గ్రామస్తుల వీడిసి కమిటీ సభ్యులు తీసుకొని గ్రామాన్ని అభివృద్ధి పరచాలి. కానీ ఇక్కడ ఒక గ్రామానికి చెందిన వీడీసీ సభ్యులు నగదును మొత్తం ను తీసుకొనడంతో తీవ్ర వాగ్వివాదం జరిగింది దీంతో పోలీసులు ఎంట్రీ ఇచ్చి సమస్యను పరిష్కరింపజేశారు. రెవెన్యూ అధికారులు సైతం పట్టించుకోక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో మొరం తవ్వకాలు, ఇసుక తవ్వకాలు, మట్టి తవ్వకాలు, ఇటుక బట్టీలకు మట్టిని తరలించడం తహసిల్దార్ అనుమతితోనే నిర్వహింపబ డతాయి. కానీ ఇక్కడ రెవెన్యూ సిబ్బంది నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరించడంతో సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా మొరం తవ్వకాలు, ఇసుక తవ్వకాలు చేపడితే భూగర్భ జలాలు ఇంకిపోయి బోరు బావులు ఎండిపోయే పరిస్థితి నెలకొంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ అధికారులు ఇసుక, మొరం తవ్వకాలపై పర్మిషన్లు ఇవ్వాలి. ప్రస్తుతం జూన్ మాసంలోనైనా ఒక్క పెద్ద వర్షం అయినా కురవలేదు. దీంతో చెరువులో నీరు పూర్తిగా తగ్గిపోయి జీవాలలు దాహార్తి తీర్చుకోవడానికి ఇబ్బందికరంగా ఉంది. పాడి రైతులకు కూడా గేదెలు చెరువుల్లో కుంటలోకి దిగి కావలసినంత నీరు తాగి బయటకు వస్తాయి. కనీసం మూగజీవులైన దృష్టిలో పెట్టుకొని చెరువుల్లోని తవ్వకాలకు అనుమాతులను ఇవ్వకూడదని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువుల్లో నల్లమట్టి తీస్తే గ్రామపంచాయతీకి సగం వాటా, గ్రామ అభివృద్ధి కమిటీకి సగం వాట, దీంతోపాటు రెవెన్యూ అధికారులకు సైతం ముడుపులు ముడుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఇంత జరుగుతున్న ఏ ఒక్క పోలీస్ స్టేషన్లో నైనా, ఒక్క తహసిల్దార్ కార్యాలయంలో కూడా అక్రమ మొరాన్ని, ఇసుకను తరలిస్తున్నట్లు దరఖాస్తు ఇవ్వకపోవడం గ్రామస్థాయి నాయకులకు ఈ విషయం పట్టించు కోకపోవడం ప్రజల్లో తీవ్రస్థాయిగా వ్యతిరేకత వస్తుంది.

# గీత కార్మికులు లైసెన్సులకు కృషి చేస్తా

**అనంతగిరి- విశాలభారతి :** అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్సులు ఇచ్చేందుకు కృషి చేస్తా కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కె ఎల్ ఎన్ ప్రసాద్ ఆదివారం అనంతగిరి మండలంలోని పాలారం గ్రామంలో గీత కార్మికులకు కొత్త లైసెన్సుల కోసం అప్లికేషన్స్ పెట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్సులు తప్పకుండా ఇప్పిస్తారని త్వరలోనే ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు అదేవిధంగా పాలారం గీత సొసైటీ రెన్యువల్ చేయించడంలో కూడా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మాత్యులు వి శ్రీనివాస్ గౌడ్ జిల్లా విద్యుత్ శాఖ మాత్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ సహకారంతో తొందరగానే అయ్యేవిధంగా చేస్తానని కేఎల్ఎన్ తెలిపారు ఈ సందర్భంగా కేఎల్ఎన్ ప్రసాద్ ను స్థానిక గౌడ సంఘీయులు పూలమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. మొక్క రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్య మట్టపల్లి ఉపేందర్, మట్టపల్లి శంకర్ బాబు, మొక్క కాశి గౌడ్, ఏడుకొండలు, రామకృష్ణ ,ఉపేందర్, తదితర గీత కార్మికులు పాల్గొని అప్లికేషన్స్ అందజేశారు

www.Vishalabharathi.com
epaper.Vishalabharathi.com

విశాల భారతి

Vishalabharathi
TeluguDaily

సోమవారం, హైదరాబాద్ 12 జూన్ 2023






## కుసుమ జగదీష్ హఠాన్మరణం బాధాకరం

**విశాలభారతి/వరంగల్ బ్యూరో:** ములుగు జిల్లా అడవి మల్లంపల్లి కి వెళ్లి, హఠాన్మరణం చెందిన ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, జెడ్పీ చైర్మెన్ కుసుమ జగదీశ్ పార్థీవ దేహం పై పుష్ప గుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జగదీష్ తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ములుగు జిల్లా పరిషత్ చైర్మన్, కుసుమ జగదీష్ హఠాన్మరణం బాధాకరమని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. నిన్న మొన్నటి వరకు కలివిడిగా తిరిగిన జగదీష్ మరణం తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది అన్నారు. వారి మృతి తనకు తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా నాటి ఉద్యమంలో జగదీష్ చురుకైన పాత్ర పోషించారన్నారు. ములుగు జిల్లా పార్టీ అధ్యక్షుడుగా, జిల్లా పరిషత్ చైర్మన్ గా జగదీష్ నన్ను కలిసినప్పుడల్లా ములుగు ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించే అడిగేవారని గుర్తు చేసుకున్నారు. రేపు మంత్రి కేటీఆర్ వస్తున్నారని చెప్పారు. సీఎం కెసిఆర్ గారు కూడా ఏదో ఒక సమయంలో వస్తారని అన్నారు. వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

## రియల్ ఎస్టేట్ వద్దు.. పొలం చేసుకునుడే ముద్దు



**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి:** భూముల ధరలు అమాంతం పెంచేశారు. ఇదిప్పటి మాట కాదు.. కానీ క్రయవిక్రయాలు అంతలా పెరగలేదు. క్రమేణా అవి జీరోకు వచ్చేశాయి. ఎన్నికల ఏడాది కావడంతో ప్లాట్ల కొనుగోళ్ల ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఏడాది కిందటదాకా%ౌా% అంతకు ముందు ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న పడావు భూములు.. కొన్ని వ్యవసాయం చేసుకునే భూములు కూడా రియల్ ఎస్టేట్ పాలయ్యాయి. ధరలు పెంచి ఇవ్వడంతో అమ్ముకున్నారు. అంతకు మించి ధర నిర్ణయించి వెంచర్లు చేసి ప్లాట్లుగా చేసినా.. . అంతగా వర్కవుట్ కాలేదు. దీంతో ప్లాట్లు పడావు పడుతున్నాయి. ఇవన్నీ గమనించిన రైతు.. పడావు భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మకానికి పెట్టడానికి ముందుకు రావడం లేదు. వ్యవసాయం చేసుకోవడమే బెటర్ అనుకుంటున్నాడు. అందుకే పడావు భూములకు అచ్చుకడుతున్నారు. కొత్తగా వ్యవసాయం విస్తీర్ణం పెరుగుతుంది. ఇది వానాకాలం సీజన్ కావడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బోర్ల మీద ఆధారపడి ఉన్న పంటల భూములతో పని లేకుండా కొత్తగా సాగులోకి వచ్చే పడావు భూములన్నీ వానాకాలం సీజన్‌తో కళకళలాడనున్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వడం%ౌా% ప్రకృతి ప్రకోపానికి పంటలు బలైనా ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్దంగా ఉన్న నేపథ్యం.. వరి ధాన్యం కొనుగోళ్లు.. చెల్లింపులు ఇవన్నీ కూడా రైతుల్లో ఓ ధీమాను నింపుతున్నాయి. రాను రాను భూములకు మరింత రేటు పెరిగే అవకాశం ఉండటంతో%ౌా% సీజన్ లేక వెలవెలబోతున్న రియల్ ఎస్టేట్‌కు భూములను బలిచేసే బదులు.. వ్యవసాయం చేసుకోవడం బెటరని రైతాంగం భావిస్తోంది.

దీంతో వ్యవసాయం విస్తీర్ణం పెరిగిపోతున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్నికలు ముగిసిన తర్వాతే మళ్లీ రియల్ ఎస్టేట్ పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. అప్పటి వరకు భూముల క్రయవిక్రయాల్లో పెద్దగా కదలిక ఉండేలా లేదు. పెంచిన రేట్లు దించేందుకు రియల్ వ్యాపారులు ఇష్టపడటం లేదు. వారికి భూములు అమ్మేందుకు రైతులూ మొగ్గుచూపడం లేదు.

# పాలకుర్తి ప్రజల గుండెల్లో ఎర్రబెల్లిది చెరగని ముద్ర

- ఆపదలో నేను ఉన్నానంటూ ఆదుకునే మనస్తత్వం
- గెలుపే తన సోంతం..కార్యకర్తలే తన బలం
- అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలతో మమేకం
- దేశంలో, రాష్ట్రంలో మంత్రిగా పలు అవార్డులు అందుకున్న ఘనత ఎర్రబెల్లి కే సోంతం
- ఎర్రబెల్లి రాజకీయ జీవితంలో ఎదురు నిలిచారు... తప్ప గెలువలేదు.
- నియోజకవర్గం ఏదైనా గెలుపే తన సోంతం
- శత్రువును మిత్రుడి గా చూసుకునే దయగల గుణం దయన్నది...
- 40ఏండ్లుగా మచ్చ లేని రాజకీయ నాయకుడిగా చెలామణి అవుతున్న ఎర్రబెల్లి
- మంత్రి మైకు పట్టుకుంటే ప్రతిపక్షాల పని బేజారు..
- ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు
- ఫ్రీ కోచింగ్ తో నిరుద్యోగుల భవిష్యత్తు కు బాటలు వేసిన మంత్రి
- రాష్ట్రం లో మంచి మనసున్న నేతల్లో ఎర్రబెల్లి దే మొదటి స్థానం
- అభివృద్ధి సంక్షేమం ఎర్రబెల్లి కి రెండు కళ్ళు
- కష్టాల్లో ప్రతిపక్ష నాయకుడున్న సరే అదుకోవడం అతడికి వెన్నతో పెట్టిన విద్య
- డబుల్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే గా ఎర్రబెల్లి
- ఎర్రబెల్లి ది అవకాశవాద రాజకీయ కాదు... ఎర్రబెల్లి చేసేది సేవా రాజకీయం..?

**విశాలభారతి - వరంగల్ బ్యూరో:** ఉమ్మడి వరంగల్ జిల్లా లో నియోజకవర్గం ఏదైనా గెలుపే తన సోంతంగా కార్యకర్తలే తన బలంగా కొనసాగుతున్న ఎర్రబెల్లికి దేశ రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు ఉంది.రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పటి వరకూ ఓటమి ఎరుగని దీరుడిగా ప్రజాసేవే తన లక్ష్యం గా అనునిత్యం ప్రజల్లో ఉంటూ ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకుని అదుకుంటూ దయన్న అంటే దయ చూపే నేతగా రాష్ట్ర రాజకీయాల్లో పేరు తెచ్చుకున్నాడు.ప్రాంతం ఏదైనా అభివృద్ధి , సంక్షేమమే తన లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నాడు.ఒక సారి ఎంపీ గా ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి డబుల్ హ్యాట్రిక్ సాధించడంటే ఎర్రబెల్లి పై ప్రజల్లో ఏంత అభిమానం ఉందో మాటల్లో చెప్పలేము.ఎర్రబెల్లి పై ప్రతిపక్షాలు పోటిలో నిలుస్తున్నరే తప్ప గెలువటం లేదంటే పాలకుర్తి లో ఎర్రబెల్లి కి ప్రజాబలం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఉద్యోగ నోటిఫికేషన్ల సమయంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఫ్రీ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి నిరుద్యోగుల భవిష్యత్తు కు బాటలు వేసి అండగా నిలిచాడు.రాష్ట్రం లోని రాజకీయ నాయకుల్లో మంచి మనసున్న నేతల్లో ఎర్రబెల్లి దే మొదటి స్థానమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

### పాలకుర్తి ప్రజల గుండెల్లో ఎర్రబెల్లిది చెరగని ముద్ర

ఎర్రబెల్లి ప్రజాప్రతినిధిగా గెలిచిన నాటి నుండి నేటి వరకు ప్రజలతో మమేకమై ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ పాలకుర్తి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు.కరోనా కష్ట కాలంలో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కరోనా భారిన పడిన ప్రజల కోసం పనిచేశాడు.కష్టల్లో ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తి ఉన్న సరే తన కష్టంగా బావించి సేవ చేసే గుణం దయన్నకు వెన్నతో పెట్టిన విద్య లాంటింది..

### ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో సేవాకార్యక్రమాలు

ఎర్రబెల్లి ట్రస్ట్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల శ్రేయస్సు కోరుకుంటున్నారు.ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల అయిన తరువాత నిరుద్యోగుల కోసం ఎర్రబెల్లి ట్రస్ట్ పేరుతో పాలకుర్తి నియోజకవర్గం వ్యాప్తంగా ఫ్రీ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి నిరుద్యోగులు ఉద్యోగాలు సాధిచండంలో ఎర్రబెల్లి కీలక పాత్ర పోషించారు.



### పల్లె పట్టణ ప్రగతిని దేశానికి చాటి చెప్పాడు

2018లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి గా కొనసాగుతున్న ఎర్రబెల్లి పల్లె పట్టణ ప్రగతిని దేశానికి చాటి చెప్పాడు.రాష్ట్రంలో గ్రామాల రూపు రేఖలను మార్చి ఇతర రాష్ట్రాల కు ఆదర్శం గా తెలంగాణ మొదటి స్థానంలో ఉండటంలో కీలక పాత్ర పోషించాడు.దేశంలో, రాష్ట్రంలో మంత్రిగా పలు అవార్డులు అందుకున్న ఘనత ఎర్రబెల్లి కే సోంతం అవుతుంది.

### పోటిలో నిలుస్తున్నరే తప్ప.... గెలువటం లేదు

ఎర్రబెల్లి పై పోటీగా పాలకుర్తి లో నిలుస్తున్నరనే తప్ప గెలువటం లేదు.పాలకుర్తి పోటిలో నాయకులు మారుతున్న రే తప్ప ఎర్రబెల్లి మెజారిటీ మాత్రం తగ్గడం లేదు.ఓడిన వ్యక్తి మళ్ళీ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయారు.ఆర్థికంగా ఉండి రాజకీయ అనుభవం కల్గిన వ్యక్తులు పాలకుర్తి లో పోటి చేసిన ప్రజాబలం ఉన్న ఎర్రబెల్లిని ఒడగోట్టడం అసాధ్యమనే చెప్పుకోవచ్చు.

### ప్రతి ఎన్నికల గెలుపులో ఎర్రబెల్లి వెంటే రాయపర్తి ప్రజలు

40 సంవత్సరాల ఎర్రబెల్లి దయాకర్ రావు రాజకీయ జీవితంలో రాయపర్తి మండలాన్ని ప్రముఖ పాత్ర అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.. వర్ధన్నపేట నియోజకవర్గంలో గతంలో రాయపర్తి మండలం కలిసి ఉండేది.. నాడు సైతం ఎర్రబెల్లి గెలుపుకు రాయపర్తి మండలం ఓటు బ్యాంకే కీలకంగా నిలిచింది అని ప్రముఖులు అంటున్నారు. 2014 ఎన్నికల్లో 14వ రౌండ్ ముగిసే సరికి సుమారు 4 వేల మెజారిటీతో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని రంగులు చల్లుకుంటున్న వేళ ఓటమి అంచుల్లో ఉన్న ఎర్రబెల్లిని రాయపర్తి మండల ప్రజలు ఏకతాటిపై నుంచి ఊహించని రీతిలో మెజారిటీ ఓట్లు అందించి గెలుపు కిరీటాన్ని ఎర్రబెల్లికి అందించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి ఎన్నికలో రాయపర్తి మండల ప్రజలు దయగల దయన్నగా పిలుచుకొనే ఎర్రబెల్లి వెంటే ఉంటున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాయపర్తి మండల పాత్రికేయులకు ఇచ్చిన మాటను మంత్రి అయిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మిస్తున్నారు .అతి త్వరలో రాయపర్తి మండలంలో పనిచేసే మరి కొంతమంది జర్నలిస్టు లకు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎర్రబెల్లి విజయానికి అనేక ఉదాహరణలు చెప్పవచ్చు...

## ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలి

**కోదాడ - విశాలభారతి :** అల్వాలపురంలో నూతనంగా నిర్మించిన దేవాలయములో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమములో మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి పాల్గొని పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ



సందర్భంగా ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీ నారాయణరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగవేటి రామారావు, మున్సిపల్ ఫ్లోర్ లిడార్ కందుల కోటేశ్వరరావు, యాదగిరి, బాగ్దాద్, బండారు వెంకటేశ్వర్లు, శ్రీను, సురేష్ నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**సుల్తానాబాద్ - పెద్దపల్లి :** జిల్లాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ తెలిపారు. ఆదివారం జిల్లాలో జరిగిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ తనిఖీ చేశారు.సుల్తానాబాద్ పట్టణంలోని అపూర్వ కళాశాల, వివేకానంద కళాశాల, పెద్దపల్లి పట్టణంలో ఉన్న డిగ్రి కళాశాల, గాయత్రి, ట్రినిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరిక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, పరిక్ష జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. ఉదయం 10-30 నుండి మధ్యాహ్నం 1-00 వరకు గ్రూప్ 1 పరీక్షను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించా మని అన్నారు. జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల్లో 6067 మంది అభ్యర్థులకు పరీక్షా వ్రాయాల్సి ఉండగా, 3753 మంది హాజరైనారు అని, 2314 మంది గైర్హాజరు అయినట్లు, 61.86 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు.



**మహబూబాబాద్ - విశాల భారతి :** మహబూబాబాద్ జిల్లాలో గ్రూప్-1 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఆదివారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని తక్షశిల హై స్కూల్, అనంతారం రహదారిలో ఉన్న తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ లను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లాలో 13 కేంద్రాలలో 4046 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలను వ్రాస్తున్నందున పరీక్షా కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని, ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రశాంతంగా పరీక్షలను నిర్వహించేందుకు బాధ్యతతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి నర్మద, తహసీల్దార్ లు విజయకుమార్, ఇమ్మనియెల్, మహ్మద్ గౌస్, డి.టి.వీరన్న, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి వ్యతిరేక ఉద్యమానికి సిద్ధం కండి

- ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వం,స్థానిక ఎమ్మెల్యే
- రాబొయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు
- ఉద్యమకారుల సన్మాన సభలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు

**విశాల భారతి పెద్దపల్లి:** మలిదశ ఉద్యమంలో దశాబ్ద కాలం పాటు శ్రమించి పోరాడిన ఉద్యమకారులను టిఆర్ఎస్ అధికారంలో వచ్చిన తర్వాత ఎమ్మెల్యే నుండి ముఖ్యమంత్రి వరకు అందరూ ఉద్యమకారులను మరిచిపోయారని మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని %=ఖ% గార్డెన్స్ లో పెద్దపల్లిలోని ఆకుల భూమయ్య జయశంకర్ సార్ల స్మారక భవన్లో జరిగిన ఉద్యమకారుల సన్మాన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.విలువైన సమయాన్ని వదులుకొని ఎన్నో త్యాగాలు కూర్చి తెలంగాణ రాష్ట్రం సాధిస్తే ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల పూర్తిగా చిన్నచూపు చూస్తుందని విజయ రమణారావు అన్నారు.పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన 150 మంది ఉద్యమకారులను ఆదివారం ఘనంగా సత్కరించి రానున్న కాలంలో ఉద్యమకారుల వెంట కలిసి ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా ఉద్యమకారులకు అన్ని రకాల ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.నూతనంగా ఏర్పడిన ఝూర?ండ్ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఉద్యమకారులకు ఎలా అందుతున్నాయో రాబొయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందేలా నా వంతు సహకారనందిస్తానన్నారు.ఇటీవల సరూర్ నగర్ లో జరిగిన యువ సంఘర్షణ సభలో ప్రియాంక గాంధీ గారి సమక్షంలో పీసీసి అద్యక్షులు రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల త్యాగాల గుర్తింపుగా అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలలో అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం మరియు అమరవీరుల గౌరవ పెన్షన్ 25000 రూపాయలు రాబొయే కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేసేలా పెద్దపల్లి నియొజకవర్గ కాంగ్రెస్ పార్టి పక్షాన కృషి చేస్తామని తెలిపిన మాజీ ఎమ్మెల్లే విజయరమణారావు. ఇక పెద్దపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఎలాంటి ఉద్యమాలు చేయలేదని కేవలం డబ్బుతో మాత్రమే ఎన్నికల గెలుస్తూ వస్తున్నారన్నారు. ఆంధ్ర పాలకుల దోపిడి కంటే పెద్దపల్లి ఎమ్మెల్యే దోపిడీ ఎక్కువ అయింది అన్నారు. చెరువు మట్టికి కోట్ల రూపాయలు వసూలు చేయడం వల్లనే ఇటిక ధర పెరిగిందన్నారు.15 ఏళ్ల క్రితం మానేరు ఇసుక ఉచితంగా లభించేదని ఇవాళ 2000 రూపాయల నుండి 3000 రూపాయల వరకు చెల్లించే రోజులు వచ్చాయన్నారు. దీనికి ఎమ్మెల్యేని పూర్తి బాధ్యత అన్నారు. ఎమ్మెల్యే అవినీతిని అడ్డుకునేందుకు ఉద్యమకారులే పెద్దపల్లిలో మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ ఇచ్చిన రుణం తీర్చుకోవడానికి సోనియాగాంధీ కోసం ఒకసారి తమలాంటి కాంగ్రెస్ నాయకులకు ఒక అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలన్నారు. ఉద్యమంలో కష్టపడ్డ వారిని తమ పార్టీ గుర్తించి ఈ సన్మానం చేసిందన్నారు మిగిలిన చాలామంది సన్మానానికి రావడానికి ప్రయత్నించినప్పటికీ ఎమ్మెల్యే వారిని బెదిరించి అడ్డుకున్నారని ఆరోపించారు.ఎన్నికల నాటికి ఇలాంటి బెదిరింపులు చెల్లవని తెలిపారు.పెద్దపల్లి నియోజకవర్గంలోని ఉద్యమ కారుల విన్నపం మేరకు సంక్షేమ బోర్డులో పొందుపరచాల్సిన అంశాలను పలు సూచనలను టీపీసీసీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చిన విజయరమణారావు.

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన గుండేటిఐలయ్య యాదవ్, తాడూరి శ్రీమాన్,కట్ట నరేంద్ర చారి,తూముల నంబా రావు, పెంచాలా మల్లయ్య ,బుర్ల ధనంజయ్, ఆకుల చంద్రయ్య,జనగామ రవి,పాలకాని కనకయ్య, మల్లికార్జున్,కట్కూరి సుధాకర్ రెడ్డి,బొంకూరి సురేందర్ సన్నీ,ఆర్ మోహన్ సరళ,విమల. కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపగాని సారయ్య గౌడ్,భూషణవేణి సురేష్ గౌడ్ ,భూతగడ్డ సంపత్, తూముల, సుభాష్ రావు.సయ్యద్ మస్రత్,బొడ్డుపల్లి శ్రీనివాస్,బొంకూరి అవినాష్. వీరేశం,బొడ్డుపల్లి తిరుపతి,రంగు శ్రీనివాస్,రాజు. రహీముల్లా ఖాన్,మన్నన్,గంగుల వెంకటేష్,నామసాని శ్రీనివాస్ ఇంకా పలువురు పాల్గొన్నారు.

